ప్రతిపక్షం
www.prathipaksham.in

గురువారం 12.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 351 పేజీలు:12 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

బ్యాటింగ్‌లో టాప్..అభిషేక్ 12

రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే ఏకే సింగ్

హాజరైన సీఎం, మంత్రులు, ప్రముఖులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 11: రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉదయం 11.30 నిమిషాలకు లోక్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్ కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రమాణం చేయించారు. శివప్రతాప్ శుక్లా తెలుగులో ప్రమాణం చేయడం విశేషం. గవర్నర్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా రుద్రాపూర్‌లో 1952 ఏప్రిల్ 1న జన్మించిన శివప్రతాప్ శుక్లా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, యూపీ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఇప్పటి వరకు హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా చేసిన

...:: మిగతా 2లో

రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 11: 'రోడ్ సెక్టార్ పాలసీ-2047'కు అనుగుణంగా రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్లను అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి పై దృష్టిపెట్టాలని సూచించాను. జీహెచ్‌ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ, రెవెన్యూ విభాగాలతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించాను. జిల్లా కేంద్రాలకు రింగ్ రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలించాలని చెప్పారు. రోడ్లు - భవనాల శాఖ పురోగతిపై ముఖ్యమంత్రి బుధవారం సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు

...:: మిగతా 2లో

ట్రాఫిక్ ఫ్రీ నగరంగా హైదరాబాద్

- కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి పై దృష్టిపెట్టాలి
- అన్ని జిల్లా కేంద్రాలకు రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలి
- ఆసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి
- రోడ్లు – భవనాల శాఖ పురోగతిపై సమీక్ష
- కాలుష్య రహిత రవాణా వ్యవస్థ లక్ష్యంగా పని చేయాలి
- ప్రభుత్వ శాఖలు ఎలక్ట్రిక్ వాహనాలనే కొనుగోలు చేయాలి
- రవాణా శాఖపై మంత్రి పొన్నం, అధికారులతో సమీక్ష

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.31 (గురువారం సాయంత్రం)

సహర్ – 5.04 (శుక్రవారం ఉదయం)



స్పీకర్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బుధవారం లోక్‌సభలో వీగిపోయింది. సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య మూజువాణి ఓటుతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది.

5



పేదల ఇళ్లు కూల్చేందుకు ప్రభుత్వానికి ఎంత ధైర్యం

వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలి

- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- వెలుగుమట్ల బాధితుల కోసం కవిత నిరాహార దీక్ష విరమణ
- పేదల ఇళ్ల కూల్చివేతపై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు
- కవిత దీక్షకు దిగొచ్చిన సర్కార్
- వెలుగుమట్ల బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు
- ఇళ్లు కూల్చిన చోటే స్థలాలు... పట్టాల పంపిణీ

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి, 11: వెలుగుమట్లలో అర్ధరాత్రి పూట బుల్డోజర్లతో పేదల ఇళ్లు కూల్చివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ప్రైవేట్ ప్రాపర్టీలోకి వెళ్లి పేదల ఇళ్లను కూల్చే అధికారం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతల ఘటనపై నిరసనగా చేపట్టిన నిరాహార దీక్షను జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, విశారదన్ మహారాజ్ బుధవారం విరమించారు. బాధితులకు ఇళ్లు మరియు ఇండ్ల పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేయడంతో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ఈశ్వరయ్య నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం విశారదన్

...:: మిగతా 2లో

వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

డిసెంబర్ 9న సీఎం చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

- రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఇల్లు మా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం
- ఒకేసారి 22,500 కోట్లు కేటాయించి రికార్డు సృష్టించాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- వెలుగుమట్ల బాధితులకు ఇళ్లు కూల్చినచోటే ఇళ్ల పట్టాలు
- ఇందిరమ్మ ఇల్లు పత్రాల పంపిణీ: పాల్గొన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల

...:: 2లో

ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం

జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, ఎన్సీ అధినేత ఫారూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. జమ్ములో ఓ వివాహానికి హాజరైన ఆయనపై ఒక వ్యక్తి బుధవారం కాల్పులకు పాల్పడ్డాడు. నిందితుడు తుపాకీని ఫారూక్‌కు గురిపెట్టినట్టు సీసీటీవీ ఫుటేజ్‌ల ద్వారా తెలుస్తున్నది.

11

ఎమ్మెల్యేలు దానం, కడియం..

పార్టీ మారినట్లు ఆధారాలు లేవు

- ఇద్దరు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు డిస్మిస్
- తీర్పు ప్రకటించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- నేడు సుప్రీంకోర్టులో విచారణ.. ఒక రోజు ముందే తీర్పు వెల్లడి
- బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఎక్కడ పని చేయలేదు: దానం
- అనర్హత పిటిషన్ చట్టబద్ధం కాదు : కడియం

...:: 2లో

'హర్మూజ్' వద్ద భీకర యుద్ధం

- ఇరాన్ మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దాడులు
- 16 మైన్‌లేయర్స్, నౌకలు ధ్వంసం అయ్యాయి
- వెల్లడించిన యూఎస్ సెంట్రల్ కమాండ్
- చమురు నౌకలను అడ్డుకుంటున్న ఇరాన్
- ఇండియా వస్తున్న థాయిలాండ్ నౌకపై దాడి
- 20 మంది నావికులను రక్షించిన ఒమన్ నౌకాదళం
- జలసంధి వద్ద అమర్చిన మైన్స్‌ను తక్షణమే తొలగించాలి
- పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి: ట్రంప్ వార్నింగ్
- ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగిస్తాం : ట్రంప్ కీలక ప్రకటన

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడడంతో అవి ధ్వంసమయ్యాయి. తాము చేపట్టిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ క్రమంలనే దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. జలసంధిలో పేలుడు సృష్టించడానికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలకు సమాచారం అందిందని ఆ దేశ మీడియా ప్రచురించింది.

చమురు నౌకలను అడ్డుకుంటున్న ఇరాన్

దాదాపు రెండు వారాలుగా పశ్చిమాసియాలో ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికాల మధ్య భీకర యుద్ధం కొనసాగుతోంది. దీనితో హర్మూజ్ నుంచి చమురు ట్యాంకర్లు వెళ్లకుండా ఇరాన్ అడ్డుకుంటోంది. అక్కడితో ఆగకుండా ఆ జలసంధి గుండా వెళ్లే

...:: మిగతా 5లో

రాష్ట్రంలో మరో డిస్కం ఏర్పాటు

- టీజీఆర్‌పీడీసీఎల్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఛైర్మన్, ఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియామకం
- వ్యవసాయం, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ విద్యుత్ అవసరాలను తీర్చనున్న కొత్త డిస్కం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 11: తెలంగాణలో మరో డిస్కంను సర్కార్ ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులను విడుదల చేసింది. ఇప్పటికే టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ ఉండగా.. తాజాగా

...:: మిగతా 2లో



దేశంలో ఎల్పీజీ కొరత లేదు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాబోయే రోజుల్లో పెట్రోల్, ఎల్‌పీజీ కొరత ఏర్పడవచ్చునన్న వార్తలను ప్రధాని మోదీ ఖండించారు. ప్రజలు ఎవరూ భయాందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

11

రాష్ట్రీయం

రాష్ట్ర గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

మొదటిపేజీ తరువాయి

శివప్రతాప్ శుక్లా తెలంగాణ గవర్నర్‌గా నియమితుల య్యారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా రుద్రాపుర్ గ్రామంలో 1952 ఏప్రిల్ 1న శుక్లా జన్మించారు. అదే గ్రామంలో పాఠశాల విద్యా పూర్తి చేసి, గోరఖ్‌పూర్‌లో కాలేజీ విద్యా పూర్తి చేశారు. ఆ తర్వాత న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందారు. ఇంతకు ముందు శివపత్రాప్ మోదీ ప్ర భుత్వంలో ఆర్థిక శాఖ సహాయమంత్రిగా పని చేశారు. ఈయన విద్యార్థిగా ఉన్నప్పుడే ఏబీవీపీ సంస్థాగత కా ర్యదర్శిగా పని చేశారు. ఆ తర్వాత 1983లో బీజేపీలో చేరారు. 1989లో మొదటిసారి గోరఖ్‌పూర్ నగర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనతాపార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ తర్వాత మళ్లీ 1991లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. యూపీలో మొదటిసా రి కల్యాణ్‌సింగ్ నేతృత్వంలో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం లో విద్యాశాఖ సహాయమంత్రిగా స్వతంత్ర హోదాలో పని చేశారు. నాలుగు సార్లు 1993, 1996లలో ఎమ్మెల్యేగా ఎన్నికై విధులు నిర్వహించారు.

1996లో కల్యాణ్‌సింగ్, రామ్‌ప్రకాశ్ గుప్తా, రాజనాథ్ ల ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. 20 ఏళ్ల తర్వాత 2016 జూన్ 10వ తేదీన యూపీ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రిగా మోదీ ప్రభుత్వంలో బాధ్యతలు తీసుకున్నారు. అలా ఎనిమిదేళ్లపాటు 2022 జులై 5 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మూడేళ్ల కిందట 2023 ఫిబ్రవరి 18న హిమాచల్‌ప్రదేశ్ గవ ర్నర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు తెలంగాణకు బదిలీ అయ్యారు.

రాష్ట్రంలో మరో డిస్కం ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి

టీజీఆర్‌పీడీసీఎల్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ టీజీఎన్‌పీడీసీఎల్ ఛైర్మన్, ఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీని నియమించింది. దాని కార్యక లాపాల పర్యవేక్షణకు మరో నలుగురు డైరెక్టర్లను కేటా యించింది. తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటు చేస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఆర్‌పీడీ సీఎల్)ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా జీవో విడుదల చేసింది. ఇప్పటికే ఉన్న తెలంగాణ సదరన్, నార్తర్న్ డిస్కమ్‌లతో పాటు ఈ కొత్త టీజీఆర్‌పీడీసీఎల్ డిస్కమ్ కూడా సేవలు అందించనుంది. అయితే ఈ మూడో కొత్త డిస్కమ్ రాష్ట్రంలోని వ్యవసాయం, ఎత్తిపో తల పథకాల ప్రాజెక్టులు, మిషన్ భగీరథ సహా మిగిలిన వాటి విద్యుత్ అవసరాలను తీర్చనుంది.

తెలంగాణలో ఇప్పటికే ఉన్న 2 విద్యుత్ పంపిణీ సంస్థ లకు అదనంగా మూడో డిస్కంను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన ఈ డిస్కం బాధ్యతలను సీనియర్ ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీకి అప్పగించింది. ఈ నే పథ్యంలోనే టీజీఆర్‌పీడీసీఎల్ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫరూఖీని నియమించింది. ఇక టీజీఆర్‌పీడీసీఎల్ కార్యకలాపాల పర్యవేక్షణకు ఛైర్మన్‌తోపాటు మరో నలుగురు డైరెక్టర్లను కూడా నియ మించారు. ఈ కొత్త డిస్కం టీజీఆర్‌పీడీసీఎల్ కేవలం సాధారణ విద్యుత్ పంపిణీ చేయడం మాత్రమే కాకుండా.. వ్యవసాయం, ప్రజా అవసరాలకు సంబంధించిన విద్యుత్ సరఫరాను పర్యవేక్షించనుంది. రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మెయింటెనెన్స్, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనుంది. రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయనుంది. తెలంగా ణలోని భారీ, మధ్యతరహా ఎత్తిపోతల ప్రాజెక్టులకు ఈ టీజీఆర్‌పీడీసీఎల్ విద్యుత్ సరఫరా చేయనుంది. మిషన్ భగీరథ, మున్సిపల్ వాటర్ సప్లై పథకం, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లను పర్యవేక్షించనుంది.

వెలుగుమట్లలో మోడల్ కాలనీ నిర్మిస్తాం

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, మార్చి 11: ఖమ్మం జిల్లా కేంద్రంలోని వెలుగుమట్లలో పేదల కోసం మోడల్ కాలనీ నిర్మిస్తాం, దేశంలోని ఇతర రాష్ట్రాల వారు వచ్చి చూసే విధంగా మోడల్ కాలనీ నిర్మాణం జరుగుతుం దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఖమ్మం పట్టణంలో వెలుగుమట్ల బాధితులకు భూదాన్ భూముల్లో ఇళ్లు కూల్చినచోటే ఇళ్ల పట్టాలు, ఇం దిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావులు పాల్గొన్నారు. 311 మందికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్న ప్ర భుత్వం హామీ ఇచ్చింది. స్వగ్రామంలో సొంతస్థలం ఉన్న 101 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 726 ఇళ్లు కూల్చినట్లు అధికారులు గుర్తించారు. వెలుగుమట్లలో 1953 నుంచి 31 ఎకరాల భూమి భూదాన్ భూమిగా ఉందని, వెంకట రాజారాం అనే రైతు భూదాన్ ట్రస్టుకు 31.1 ఎకరాలు రాసిచ్చినట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. పక్కన ఉన్న మిగతా భూమి అంతా పట్టా భూములుగా ఉందని స్పష్టం చేశారు.

మాది పేదల గురించి ఆలోచించే ప్రభుత్వం

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గురించి ఆలోచించే ప్రభుత్వమన్నారు. నిజమైన పేదలు అయ్యుంటే ఇల్లు లేని వారు ఉండొద్దనేది తమ ఆశయమన్నారు. తొలి ఏడాదే 4.50 లక్షల ఇందిర మ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామన్న ఆయన ఇల్లు మంజూరు చేయటమే కాదు, నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు కూడా చెల్లిస్తున్నట్లు తెలిపారు. పేదల నిస్సహాయ తను అడ్డుగా పెట్టుకుని కొందరు రాజకీయం చేశారని విమర్శించారు. పేదలకు నిజంగా మేలు చేయాలనే ఆలోచన లేకపోయినా రాజకీయం చేశారని మండిపడ్డా రు. అమాయకులను మోసం చేసి కొందరు రూ.లక్షల్లో వసూలు చేశారన్న భట్టి వెలుగుమట్ల పేదలకు కనీస వసతులు కల్పించాలని తాము కూడా అడిగామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ వెలుగుమట్ల పేదలకు నీరు, విద్యుత్ ఎందుకు ఇవ్వలేదు? అని ప్రశ్నించారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

వెలుగుమట్లలో పేదలకు పంచగా మిగిలిన 16 ఎకరాల భూమిని తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల నిర్మాణానికి ఉపయోగిస్తాం అన్నారు. భూదాన్ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాదు కరెంటు, నీళ్లు, రోడ్లు, ఆసుపత్రి, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. 'రేపటి నుంచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించండి డిసెంబర్ 9 కల్లా మోడల్ కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారుల ను ఆదేశిస్తున్నాను, ముగ్గురు మంత్రులము కలిసి సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తాం డిసెంబర్ 9 కల్లా నిర్మాణం పూర్తి చేయాలి పాలు పొంగించాలి' అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గృహప్రవేశాలు జరగాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇది పేదల పక్షాన మాకు ఉన్న నిబద్ధత అన్నారు. ఇల్లు కట్టిస్తామని పది సంవత్సరాలపాటు పరిపాలించిన వారు చెప్పిన మాటలు నమ్మి చూసి చూసి పేదల కళ్ళు కాషాయని, వారు ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. అలాంటి వారికి మా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లే దన్నారు.

రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు

మొదటిపేజీ తరువాయి

పాల్గొన్నారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిం చడానికి ప్రతిపాదించిన ఆయా ఆసుపత్రి భవనాల నిర్మా ణాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని చెప్పారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసం ధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ - విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగా ర్జునసాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్‌యూ బీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ శాఖలు ఎలక్ట్రిక్ వాహనాలనే కొనుగోలు చేయాలి

ప్రభుత్వ శాఖలు ఇకనుంచి తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహ నాలను మాత్రమే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాలుష్య రహిత రవాణా వ్యవస్థ లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ విధానాలకు స్వస్తి చెప్పాల ని, మొత్తం ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగించా లని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రవాణా శాఖ అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ శాఖ ఉన్నతా ధికారులతో సమీక్షించారు. ఆర్‌టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. రోడ్డు ప్రమాదా లపై అవగాహన పెంచాలని, ప్రజల్లో చైతన్యం తేవడానికి షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించాలని సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్‌కు స్థలం కేటాయి స్తామని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పేదల ఇళ్లు కూల్చేందుకు ప్రభుత్వానికి ఎంత ధైర్యం

మొదటిపేజీ తరువాయి

మహారాజ్, జస్టిస్ ఈశ్వరయ్యలతో కలిసి కవిత మీడియాతో మాట్లాడారు. వెలుగుమట్లలో జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రజలంతా తీవ్ర ఆవేదనకు గురయ్యార ని కవిత అన్నారు. అర్ధరాత్రి సమయంలో బుల్డోజర్లతో పేదల ఇళ్లు కూల్చివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. పేదలకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ వారి ఇళ్లను కూల్చివేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత బాధితులను అవహేళన చేస్తూ వారికి భూమిపై హక్కులు లేవని చెప్పడం బాధాక రమన్నారు. సమస్య పరిష్కారం కోసం విశారదన్ మహా రాజ్‌తో కలిసి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఖమ్మంలో బాధితులను పరామర్శించి పరిస్థితులను పరిశీ లించిన తర్వాత పెద్ద ఎత్తున పోరాటం ప్రారంభించామని చెప్పారు. ప్రైవేట్ ప్రాపర్టీలోకి వెళ్లి ఇళ్లను కూల్చివేయడానికి ప్రభుత్వానికి ఎలాంటి అధికారం ఉందని ప్రశ్నించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ స్పందించి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన టోకెన్లపై ఇంకా అను మానాలు ఉన్నాయని, ప్రతి కుటుంబానికి కేటాయించిన స్థలాన్ని లేఅవుట్ రూపంలో స్పష్టంగా చూపించాలని డిమాండ్ చేశారు. కూల్చివేసిన ఇళ్లను కొంతమంది పది లక్షల నుంచి ముప్పై లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించుకు న్నారని, ఐదు లక్షల రూపాయల ఇల్లు ఇవ్వడం ద్వారా నష్టం భర్తీ కాదని అన్నారు. వెలుగుమట్ల ఘటనపై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు చేసి బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగిందా లేదో పరిశీలిస్తామని తెలిపారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొన సాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న లక్షా 74 వేల ఎకరాల భూదాన్ భూములపై ప్రభుత్వ పెద్దల కన్ను పడిందని కవిత ఆరోపించారు. వెలుగుమట్లలో జరిగిన కూల్చివేతలు ట్రయల్ మాత్రమేనని, ఎలాంటి ప్రతిఘటన రాకపోతే రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూములను కాజేసే కుట్ర ఉందన్నారు. భూదాన్ భూముల వివరాలపై ప్రభు త్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లు కూల్చిన అధికారులపై కేసులు నమోదు చేయాలని, బాధితులకు మద్దతుగా నిలిచిన కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆమె కోరారు. పేదల కోసం చేసే పోరాటంలో ఎక్కడా తగ్గేదేలేదని కవిత స్పష్టం చేశారు.

కవిత దీక్షకు దిగొచ్చిన సర్కార్

వెలుగుమట్ల బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు

ఇళ్లు కూల్చిన చోటే స్థలాలు... పట్టాల పంపిణీ

ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల భూదాన్ భూముల వివాదం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిం చిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల కూల్చివేతతో నిరాశ్రయులైన వందలాది కుటుంబా లకు ఉపశమనం కల్పిస్తూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ బుధవారం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క మల్లు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు పట్టాలు అంద జేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షతో ప్రభుత్వం కదిలినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. బాధి తులకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గబోమని కవిత ప్రకటించడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించి చివరకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వనుంది. వెలుగుమట్లలో ఇళ్లు నేలమట్టం చేసిన ప్రదేశంలోనే బాధితులకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు అక్కడ భూమిని చదును చేసే పనులను అధికారులు ప్రారంభించారు. అర్హులైన బాధితులకు బుధవారం ఖమ్మం కలెక్టరేట్ లో పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వ రరావు పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు.

వెలుగుమట్ల బాధితుల కోసం కవిత దీక్ష విరమణ

వెలుగుమట్ల బాధితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాల ని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విరమిం చారు. బంజారాహిల్స్‌లోని నివాసానికి చేరుకున్న ఆమెకు కుటుంబ సభ్యులు దిష్టి తీసి, హారతి ఇచ్చి ఇంట్లోకి ఆహ్వా నించారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాల యంలో కవిత నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ దీక్షలో ఆమె కుమారుడు ఆదిత్య కూడా మద్దతుగా పాల్గొని తల్లికి అండగా నిలిచారు. అమెరికాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన తరువాత నుంచి ఆదిత్య, కవిత చేపడుతున్న కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేష న్ల సాధన కోసం చేపట్టిన ఉద్యమం, బీసీ బిల్లుల ఆమోదం కోసం నిర్వహించిన బంద్ వంటి కార్యక్రమాల్లో కూడా తల్లితో కలిసి పాల్గొన్నారు. దీక్ష అనంతరం బంజారాహి ల్స్‌లోని నివాసానికి చేరుకున్న కవితకు కుటుంబ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. దిష్టి తీసి, హారతి ఇచ్చి ఆమెను ఇంట్లోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యేలు దానం, కడియం.. పార్టీ మారినట్లు ఆధారాలు లేవు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 11: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లకు సంబంధించి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కీలక తీర్పును వెలువరించారు. శాసన సభ్యులు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై అనర్హత పిటిషన్లను డిస్మిస్ చేశారు. ఆ ఇద్దరూ పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని తీర్పులో పేర్కొన్నారు. ఇదే అంశంపై గురువారం దేశ సర్వో న్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో విచారణ ఉండటంతో సభాపతి ఇవాళ నిర్ణయాన్ని వెల్లడించారు. దీంతో ఇప్పటివ రకు పార్టీ ఫిరాయిపులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మందికి స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు.

బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఎక్కడ పని చేయలేదు: దానం

తనపై వచ్చిన అనర్హత పిటిషన్‌స్పీకర్‌డిస్మిస్ చేసిన అనంతరం దానం నాగేందర్ స్పందించారు. బీజేపీ, బీఆ ర్ఎస్, కేటీఆర్ పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మం గళవారం జరిగిన బీఆర్ఎస్ఎల్పీ భేటీకి తనను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కాలేదని కేసీఆర్ ఎలాంటి ఇబ్బంది పడడంలేదని, సీఎం పదవి పోయిందని కేటీఆర్ కుచాలా ఇబ్బందిగా ఉందన్నారు. తనపై బీజేపీ ఎందుకు ఫిర్యాదు చేసిందని దానం నాగేందర్ ప్రశ్నించా రు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని ఆయన ఎద్దేవా చేశారు. ఎంపీగా ఓడిపోవడానికి కారణం బీజేపీ, బీఆర్ఎస్ అపవిత్ర కలయిక అని అన్నారు. తాను ఎంపీగా గెలిచి ఉంటే ఈ పంచాయతీ ఉండేది కాదన్నారు. తాను ఎక్కడా సభ్యత్వం తీసుకోలేదన్న ఆయన శాసనసభలోనూ ఎక్కడా విప్ జారీ కాలేదన్నారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఎక్కడ పని చేయ లేదని వివరించారు.

అనర్హత పిటిషన్ చట్టబద్ధం కాదు : కడియం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన అనర్హత పిటిషన్ చట్టబద్ధం కాదని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. పార్టీ ఫిరాయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మె ల్యేలపై కేసీఆర్ ఎందుకు పిటిషన్ వేయలేదని ప్రశ్నించారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల నేతలు ఎంత మందిని చేర్చుకున్నారో చెప్పాలన్నారు. గతంలో చేసింది తప్పని భావించి, తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్ష మాపణలు చెబితే పదవికి రాజీనామా చేసి ఉపఎన్నికకు వె ళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలు తనకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్ చట్టబద్ధం కాదని ఆయన వివరించారు. ఆ పార్టీ తనకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని అన్నారు. కేసీఆర్ ఎన్నడూ ప్రజలముందుకు వచ్చి ఫిరాయింపుల గురించి మాట్లాడలేదని ఆక్షేపించారు. సభలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వ్యవహరించలేదన్నారు. తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని ఆ పార్టీ నాయకత్వానికి దూరంగా ఉన్నాం అని తెలిపారు.

త్వరలో జర్నలిస్టులకు తీపి కబురు

- ఇండ్ల స్థలాల కలను నెరవేరుస్తాం
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిపై మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, మార్చి 11 : త్వరలో రాష్ట్రవ్యాప్తం గా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలపై తీపి కబురు ఇస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమల నాగేశ్వరరావు అన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎ ఫ్) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తి మేరకు మంత్రులు స్పందిం చారు. ఖమ్మం కలెక్టరేట్ లో బుధవారం వెలుగుమట్ల భూ నిర్వాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ అనంతరం టీడబ్ల్యూ జేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు ''నెక్ట్స్ మీకే.. ముఖ్యమంత్రి ఇప్పటికే చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు లకు త్వరలో తీపి కబురు అందిస్తాం. కల నెరవేర్చుతాం..'' అన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉందని, న్యాయపరమైన చిక్కులు లేకుండా రా ష్ట్రవ్యాప్తంగా ఓ పాలసీ తీసుకు వస్తామని, జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తామని ప్రజా ప్రభుత్వం హామీ ఇచ్చిందని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు గుర్తు చేశారు. అనేక మంది జర్నలిస్టులు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు కావడంతో వారి ఆర్థిక స్థితిగతులు ఏమాత్రం ఆశా జనకంగా లేవన్నారు. ఒక్కొక్కరూ పది, పదిహేను ఏళ్లుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నా ఇప్పటి వరకూ గజం జాగాకు కూడా నోచుకోలేదని, చాలా దుర్భరంగా జీవితాలను వెళ్లదీ స్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు సైతం స్థలాలు ఇవ్వాలని, అలాగే అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద గృహనిర్మాణ లబ్ధి చేకూర్చాలని వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, నాయకులు కూరాకుల గోపీ, ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, మధుశ్రీ, రాంపుడి నాగేశ్వరరావు, జానీపాష, యాకేష్, తురగ రాజేంద్రమూ ర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, గణేష్, అర్షద్, శరత్, రవికుమా ర్ తదితరులు పాల్గొన్నారు.

భారత పేసర్ బుమ్రా వయస్సు పెరుగుతుండటం, వర్క్ లోడ్ కారణంగా బుమ్రా వరుసగా టెస్టుల్లో ఆడటం కష్టం. ఆస్ట్రేలియా వంటి పెద్ద జట్లతో జరిగే టెస్టులకే బుమ్రా పరిమితం కావచ్చు. ఇది టెస్ట్ క్రికెట్‌కు పెద్ద లోటు. టీ20ల్లోనూ టెస్ట్ లెంగ్త్ బంతులతో బ్యాటర్లను ఇబ్బంది పెట్టే అరుదైన బౌలర్ బుమ్రా.

- ఆస్ట్రేలియా బౌలర్ మెక్‌గ్రాత్

రాజకీయం

ఎస్టీలందరూ ఏకం కావాలి

- ఆదివాసీ గిరిజన ఏజెన్సీ ల మీద కార్పొరేట్ల దాడి
- అటవీ సంపదను కొల్లగొడుతున్నారు
- వారిని మనమంతా ఐక్యంగా అడ్డుకోవాలి
- బీజేపీ పాలనలో ఎస్టీలకు తీవ్ర అన్యాయం
- ఆదివాసీ గిరిజనులకు కాంగ్రెస్ శ్రీరామరక్ష
- రాష్ట్ర పంచాయతిరాజ్‌శాఖా మంత్రి సీతక్క
- ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

ఆదివాసీ గిరిజనులకు కాంగ్రెస్ శ్రీరామరక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 11: ఎస్టీ సామాజిక వర్గ ప్రజలంతా ఏకం కావాల్సిన తరుణమిదని రాష్ట్ర పంచాయతిరాజ్ శాఖా మంత్రి సీతక్క అన్నారు. గాంధీభవన్లో బుధవారం జరిగిన ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆదివాసీ గిరిజన ఏజెన్సీ ఏరియాల మీద కార్పొరేట్లు దాడి చేస్తున్నారని, మన అటవీ సంపదను, మైనింగ్ పేరుతో మన కొండలను గుట్టలను కొల్లగొడుతున్నారని అన్నారు. వారిని మనమంతా ఐక్యంగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు మొదటినుంచి ఎస్సీ, ఎస్టీలకు అనగారిన వర్గాలకు అండగా నిలిచాయని, రాజ్యాంగంలో ప్రత్యేక రక్షణను కల్పించాయని అన్నారు. ఐదవ షెడ్యూల్, ఆరవ షెడ్యూల్, పెస చట్టాలు తెచ్చి ఎస్టీలకు రక్షణ కవచంగా కాంగ్రెస్ నిలిచిందని అన్నారు. తొలి ప్రధాని నెహ్రూ మొదలుకొని.. రాహుల్ గాంధీ వరకు ఎస్టీల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, మన ప్రాంతాల మీద దాడులు చేశారు.. మన చట్టాలను ఉల్లంఘించారు.. సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారు..కాంగ్రెస్ పార్టీతోనే గిరిజనులకు సంక్షేమం లభిస్తోందని అన్నారు. అట్టడుగు వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని, రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే మన సమస్యలు పరిష్కారం అవుతాయని, ఈ దేశం బాగుపడుతుందని అన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను బీజేపీ కార్పొరేట్లకు కట్టబెడుతుందని, బీజేపీ ప్రోత్సాహంతో ప్రధాని అంబానీ వంటి కార్పొరేట్ శక్తులు మన వనరులను, మన అడవులను దోచుకుంటున్నాయని అన్నారు.

ఫిరాయింపులకు బీజం వేసింది కేసీఆర్ కాదా?

- ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకోలేదా?
- ఏకంగా మంత్రులను చేసిన చరిత్ర మీది కాదా?
- ఆ సంస్కృతి మీరే మొదలు పెట్టారు
- కేటీఆర్‌పై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 11: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో రాజకీయ ఫిరాయింపులకు బీజం వేసింది కేసీఆర్ కాదా? గతంలో ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకోవడమే కాకుండా, ఏకంగా మంత్రులను చేసిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై విమ్మలు చేసే ముందు బీఆర్ఎస్ గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్సీ దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ జాతీయ స్థాయి నాయకుడైన రాహుల్ గాంధీపై కేటీఆర్ చేస్తున్న సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ‘ పార్టీ ఫిరాయింపులు తెలంగాణలో మొదలు పెట్టింది కేసీఆర్. జాతీయ స్థాయి నాయకుడైన రాహుల్ గాంధీపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగినవి కావు. ఎక్కడో ఉన్న రాహుల్ గాంధీ ముచ్చట మీకెందుకు. ఒకప్పుడు ఎమ్మెల్యేలను మీ పార్టీలో చేర్చుకొని ఏకంగా మంత్రులను చేసిన సంస్కృతి మీది. మీ నాయకత్వం నచ్చకనే 10 మంది బయటికి వచ్చారు. కడియంతో పాటు పది మంది ఎమ్మెల్యేలను ప్రాధేయపడి మీ పార్టీలోకి ఆహ్వానించు. హరీష్ రావు, కేటీఆర్ మధ్య అంతర్గత గొడవ వల్ల పార్టీలో ఉండలేక పోతున్నామని మీ పార్టీ నేతలు చెబుతున్నారు. మీ పార్టీపై ఎవరికీ నమ్మకం లేదు.. బయటికి వెళ్లిన వాళ్లను మళ్లీ మీ పార్టీలో తెచ్చుకోగలరా? గతంలో కాంగ్రెస్ శాసన సభ పక్షాన్ని బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎక్కడ ఉన్నావు. ఇప్పుడు నువు మాట్లాడే వాళ్ళు కాంగ్రెస్, తెలుగుదేశం నుండి నీ పార్టీలోకి వచ్చిన వాళ్ళు కాదా..? ప్రజలకి ఇబ్బంది ఐతే స్పందించే గుణం ప్రతిపక్షాలకి ఉండాలి. అబద్ధపు రాజకీయ ప్రచారాలు కాదు’ అని అన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్
మాట్లాడటం హాస్యస్పదం

- ముందు క్షమాపణలు చెప్పి
- తలసాని, సబితలకు నేరుగా మంత్రి పదవులు ఇచ్చింది మర్చిపోయారా
- రాష్ట్ర పంచాయతిరాజ్‌శాఖా మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 11: బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పుపై మంత్రి సీతక్క స్పందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫిరాయింపులపై మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేటీఆర్.. ముందు క్షమాపణలు చెప్పి మాట్లాడాలని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకున్నారని, మండలి చైర్మన్ పదవి లాగేసుకున్నారని గుర్తుచేశారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డిలకు నేరుగా మంత్రి పదవులు ఇచ్చిన విషయాన్ని కేటీఆర్ మర్చిపోయారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నీతి మంతుడైనట్టు మాట్లాడుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ తన పరిధి మేరకే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ‘బీఆర్ఎస్ తీసుకుంటే అభివృద్ధి కోసం కాంగ్రెస్ తీసుకుంటే ప్రజాస్వామ్యంపై దాడా’ అంటూ మంత్రి మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు సిగ్గుండాలని అంటూ మంత్రి సీతక్క తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే బీఆర్ఎస్ : టీపీసీసీ చీఫ్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందే బీఆర్ఎస్ అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫిరాయింపుల గురించి కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. స్పీకర్ తన అధికార పరిధిలోనే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కేటీఆర్, హరీష్ రావు ఏం మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసిందే బీజేపీ అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేస్తుందనే ప్రజలు ఆశీర్వదిస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

జర్నలిస్టులకూ ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీం

- సీఎంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటాం
- టీడబ్ల్యూజేఎఫ్ నేతలతో మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి11: ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేస్తున్న ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకూ వర్తింపజేసే అంశంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అమలు చేస్తున్న హెల్త్ స్కీం ను జర్నలిస్టులు, వారి కుటుంబాలకు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) బృందం బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ, జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితో చర్చించి హెల్త్ పాలసీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రిని కలిసినవారిలో టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఈ. చంద్రశేఖర్, బి జగదీశ్వర్ ఉన్నారు.

ఉమెన్ వెల్‌నెస్ అమలులో అలసత్వం వద్దు

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 11: స్వయం సహాయక సంఘాల మహిళల కోసం చేపట్టిన ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ ప్రోగ్రామ్ అమలులో ఎలాంటి అలసత్వం వహించవద్దని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కార్యక్రమ పురోగతిపై సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మహిళలను పరీక్షల కోసం ఆసుపత్రులకు తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేసి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46 లక్షల మహిళలకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వివరాలను క్యూఆర్‌కోడ్ ఆధారిత డిజిటల్ హెల్త్ రికార్డులుగా నమోదు చేయనున్నట్లు తెలిపారు.

స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలి

- అభిశంసన తీర్మానం చర్చలో ఎంపీ మల్లు రవి

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 11: ఎంపీ డాక్టర్ మల్లు రవి లోక్ సభలో స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలని కోరుతూ తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, పలువురు ప్రతిపక్ష సభ్యులకు సభలో మాట్లాడే అవకాశాలను పదే పదే తిరస్కరించడంపై డాక్టర్ మల్లు రవి తన ప్రసంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు నిశ్శబ్దం మీద కాదు, చర్చల మీద నడుస్తుందని, ప్రతిపక్షాన్ని నిశ్శబ్దం చేయడం అంటే లక్షలాది మంది పౌరుల గొంతులను నిశ్శబ్దం చేయడమేనని ఆయన నొక్కి చెప్పారు. భారత దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూపై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు, నెహ్రూ స్వాతంత్ర్య పోరాటంలో తొమ్మిది సంవత్సరాలకు పైగా (3,259 రోజులు) బ్రిటిష్ జైళ్లలో గడిపారని, ఆధునిక భారతదేశ నిర్మాతగా చారిత్రాత్మక పాత్ర పోషించారని సభకు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పార్లమెంటరీ పనితీరుకు న్యాయం, నిష్పాక్షికత మరియు అసమ్మతిని గౌరవించడం అవసరమని పేర్కొంటూ, ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డాక్టర్ మల్లు రవి డిమాండ్ చేశారు. చర్చ సందర్భంగా, తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 కింద ఉన్న రాజ్యాంగ నిబంధనలను కూడా ఆయన స్పష్టం చేశారు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 బహుళ పార్టీల మద్దతుతో పార్లమెంటులో రాజ్యాంగబద్ధంగా ఆమోదించబడిందని వివరించారు. న్యాయం, న్యాయం మరియు ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవాన్ని నిర్ధారించడం ద్వారా పార్లమెంటు గౌరవం మరియు విశ్వసనీయతను ఎల్లప్పుడూ కాపాడాలని డాక్టర్ మల్లు రవి పునరుద్ఘాటించారు.

గ్యాస్ బుకింగ్ పేరుతో మోసాలు

- నగర పోలీస్ కమిషనర్‌సజ్జనార్ హెచ్చరిక

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 11: వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని, గ్యాస్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెతికే అమాయకులే లక్ష్యంగా కొత్త తరహా మోసాలకు తెరతీశారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రజలను అలర్ట్ చేశారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ, అదనపు సిలిండర్లు ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని, వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఫేక్ వెబ్‌సైట్ లింకులను పంపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అప్రమత్తం చేశారు.ముఖ్యంగా, ఆన్‌లైన్‌లో ముందుగా డబ్బులు చెల్లిస్తే గ్యారెంటీగా, అత్యవసరంగా గ్యాస్ సరఫరా చేస్తామని నమ్మబలికే సందేశాలు వస్తే అవి కచ్చితంగా సైబర్ మోసాలేనని ప్రజలు గ్రహించాలన్నారు. ఇలాంటి అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని సూచించారు.సిలిండర్ బుకింగ్ లేదా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్లను లేదా అధీకృత గ్యాస్ ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలన్నారు. ఆకర్షణీయమైన ఆఫర్లు చూసి గుర్తుతెలియని వ్యక్తులకు మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని సూచించారు.నకిలీ వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేయడం ద్వారా మీ వ్యక్తిగత, ఆర్థిక సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని అప్రమత్తం చేశారు.ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ మోసాలకు గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 కి కాల్ చేయాలి. లేదా https://cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

దావత్ ఏ ఇఫ్తార్’ను విజయవంతం చేయాలి

- ఎల్‌బీ స్టేడియంలో సీఎం ఇఫ్తార్ విందు
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- మంత్రి అజారుద్దీన్, సలహాదారు షబ్బీర్‌అలీ
- ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 11: రంజాన్ ఇఫ్తార్ ఏర్పాట్లను వేగవంతంగా చేపట్టి నిర్దేశించిన సమయానికి అందించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అధికారులను ఆదేశించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెలమార్చి 15న ఎల్‌బీ స్టేడియంలో దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిలతో కలిసి మంత్రి వివిధ శాఖల అధికారులతో ఎల్‌బీ స్టేడియంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది తన మొదటి రంజాన్ దావత్ ఏ ఇఫ్తార్ కార్యక్రమమని, దీనిని ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భద్రతా ఏర్పాట్లు, ఆహార భద్రతా ప్రమాణాలు, సరిపడా ఆహార సరఫరా, తగిన సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, ఇతర ప్రముఖులతో కలసి మంత్రి శాఖల వారిగా చేపట్టబోయే ఏర్పాట్లపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కమిషన్ చైర్మన్లు, సభ్యులు, మతపెద్దలు ఈ వేడుకలకు హాజరుకానున్నారని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లను మరింత మెరుగ్గా ఉండేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, పార్కింగ్ సౌకర్యం, ట్రాఫిక్ మళ్లింపు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇఫ్తార్ వేడుకలకు వచ్చేవారికి ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నం కాకుండా సరిపడా ఆహార కౌంటర్లు, తగిన సంఖ్యలో సర్వర్లు, త్రాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్బీ స్టేడియంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని, ప్రొఫెసర్ ఎస్.ఏ. షుకూర్, అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, ఖైరతాబాద్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ శిల్పావల్లి, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జీవి నారాయణరావు, సమాచార శాఖ అదనపు సంచాలకులు జగన్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాధాకృష్ణ, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్ ప్రసాద్ తివారీ ప్రమాణ స్వీకారం

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, మార్చి 11: చెన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహేశ్ ప్రసాద్ తివారీ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కార్మిక మరియు మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి హాజరయ్యారు. మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మహేశ్ ప్రసాద్ తివారీతో పాటు కమిటీ సభ్యులు కూడా పదవీ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్తగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్ మరియు సభ్యులకు అభినందనలు తెలిపారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా మార్కెట్ కమిటీ పని చేయాలని సూచించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. కొత్త చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

రష్యా, పాక్ లీడర్లతో యుద్ధ పరిస్థితులపై చర్చించాం. ప్రాంతీయ శాంతిని నెలకొల్పడానికి ఇరాన్ కట్టుబడి ఉంది. యుద్ధం ముగియాలంటే ఇరాన్ పెట్టిన షరతులకు యూఎస్, ఇజ్రాయెల్ అంగీకరించాలి. అంతర్జాతీయంగా ఇరాన్‌కు ఉన్న చట్టబద్ధమైన హక్కులను గౌరవించాలి. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలి. భవిష్యత్తులో దాడులు జరగవని హామీ ఇవ్వాలి.

- ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
గురువారం
12.03.2026
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

'జెన్ జీ'.. రాజకీయ పునర్నిర్మాణం

సౌత్ ఏషియాలో ఓ శక్తివంతమైన కొత్త రాజకీయ శక్తి ఆవిర్భావాన్ని చూస్తోం ది. జనరేషన్ జెన్ అనే యువతరంగం. విరామం లేని, డిజిటల్‌గా మమేకమై, అసహన తరం. స్మార్ట్ ఫోన్‌లు, సోషల్‌మీడియా, గ్లోబల్ కనెక్టివిటీ యుగంలో ఆవిర్భవించిన ఈ తరం దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయించిన రాజకీయ స్తబ్దత, అవినీతి, వంశపారంపర్య అధికార వ్యవస్థలను అంగీకరించడానికి సిద్ధంగా లేదు. నేపాల్‌లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఈ తరం మార్పునకు ఓ అద్భుతమైన ఉదాహరణ. బాలేంద్ర షా విజయం, యువత నడిపే రాజకీయ ఉద్యమం విస్తరణ నేపాల్ సాంప్రదాయ రాజకీయ వ్యవస్థను కూల్చివేసింది. అదే సమయంలో, బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలు విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ప్రయోగం నిరసనలను రాజకీయ శక్తిగా మరల్చడంలో విఫలమైంది. నేపాల్‌కు విరుద్ధమైన కథ ఇది. ఈ కథనాలు పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. జనరేషన్ జెన్ భారతదేశంతో సహా దక్షిణాసియా అంతటా రాజకీయాలను పునర్నిర్మించగలదా. నేపాల్ లో ఈ మధ్య జరిగిన ఎన్నికలు ఓ రాజకీయ భూకంపం వంటివే. దశాబ్దాలుగా నేపాల్ రాజకీయం సాంప్రదాయ పార్టీలు, అనుభవజ్ఞులైన నాయకుల ఆధిపత్యంలో సాగేవి. నేపాలీ కాంగ్రెస్ వర్గాలు, కె.పి.శర్మ ఓలి వంటి ప్రముఖుల నేతృత్వంలో కమ్యూనిస్ట్ గ్రూప్‌ల మధ్య రాజకీయ అధికారం ఊగిసలాడింది. 2008లో రాచరిక వ్యవస్థ రద్దయి గణతంత్ర రాజ్యాంగం ఆమోదం పొందినా, వ్యవస్థ మారలేదు నేపాల్ లో రాజకీయ వ్యవస్థ ఒక ఉన్నత వర్గం నుంచి మరో ఉన్నత వర్గానికి బదలీ అయిందని చాలామంది నేపాలీ పౌరులు భావించారు. అవినీతి, కుంభకోణాలు, వర్గపోరు, దీర్ఘకాలిక అస్థిరత ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఫలితంగా జనాభాలో పెద్ద సంఖ్యలో ఉన్న యువ నేపాలీల నిరాశ నిస్పృహలు తారస్థాయికి చేరాయి. నేపాల్‌లో జనరేషన్ జెన్ కొత్త తరహా రాజకీయాలను కోరింది. పారదర్శకంగా, జవాబుదారీగా, దేశపాలనను నియంత్రించిన పాలకులనుంచి విముక్తి పొందింది. ఇందుకు సోషల్ మీడియా ప్రధాన సాధనంగా మారింది. ఈ పరిణమాలనుంచి బాలేంద్ర షా అనే యువ తరంగం ఉద్భవించాడు. అందరూ బాలెన్ అని పిలిచే, రాపర్, ఇంజనీర్, ఆతర్వాత కాలంలో ఖాట్మండు మేయర్ అయిన బాలేంద్ర షా, సాంప్రదాయ రాజకీయ తరగతికి పూర్తి భిన్నంగా ప్రాతినిధ్యం వ్యవహరించాడు. బాలెన్ షా రాజకీయ విజయం యాదృచ్ఛికం కాదు. అతడి ప్రచారం యువత నిరసన శక్తిని సమర్థంగా ఉపయోగించుకుంది. నేపాల్ ఎన్నికల ఫలితాలు సాంప్రదాయ రాజకీయ ఉన్నత వర్గాలపట్ల ప్రజల సంతృప్తిని ఎత్తిచూపాయి. ఒకప్పుడు నిరసనల ద్వారా తమ కోపాన్ని వ్యక్తం చేసిన తరం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. బిఎన్‌పి పునరాగమనం, ప్రభుత్వ మార్పును సూచిస్తున్నా, యువత ఆశించిన పరివర్తనను అది పాదుకొల్పలేదు. బంగ్లాదేశ్ అనుభవం నిరసన ఉద్యమాలను స్థిరమైన రాజకీయ సంస్థలను మార్చడంలో ఎదురయ్యే ఇబ్బందులను చెప్పక చెబుతోంది. నేపాల్, బంగ్లాదేశ్‌లలో ఎదురైన విభిన్నమైన ఫలితాలు, యువత రాజకీయాల గురించి ఓ ప్రాథమిక సత్యాన్ని వివరిస్తాయి. అతి పెద్ద దేశం, ఎన్నో రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు లోతైన సంస్థాగత నెట్‌వర్క్, ఆర్థిక వనరులు కలిగి ఉంటాయి. అవి కొత్త ఉద్యమాలను కష్టతరం చేస్తాయి. భారతదేశంలో ఎన్నికల రాజకీయాలకు విస్తృత స్థాయిలో అట్టడుగు స్థాయినుంచి సమీకరణ, సంస్థాగతంగా సంకీర్ణపరమైన నిర్మాణం అవసరం. ఇంకా కులం, మతం, భాష, ప్రాంతీయ గుర్తింపులతో కూడిన విస్తృతమైన సామాజిక వైవిధ్యం, తరచు రాజకీయ సమీకరణలను విచ్ఛిన్నం చేస్తుంది. యువత క్రియాశీలత జాతీయ దృష్టిని ఆకర్షించినా, ఆ శక్తి ఏకీకృత రాజకీయ ఉద్యమంగా మార్చడం సవాల్‌గా మిగిలిపోతుంది. అయినా, భారతదేశంలో జనరేషన్ జెడ్ రాజకీయ తరంగాన్ని తక్కువగా అంచనా వేయలేం. యువ ఓటర్లు నిర్మాణాత్మక ఎన్నికల కూటమిగా మారుతున్నారు. రాజకీయ పార్టీలు, తమ అజెండాలు, నాయకత్వాలను నిర్మించడంలో యువ ఓటర్ల డిమాండ్లను ప్రతిబింబించేలా మార్చుకోవచ్చు. పొరుగు దేశాలలో రాజకీయ పరిణామాలు భారతదేశానికి వ్యూహాత్మకంగా ముఖ్యమైనవిగా మారాయి. నేపాల్ రాజకీయ కొత్త నాయకత్వంలో మార్పు, సరిహద్దు ఆర్థిక సహకారాన్ని ప్రభావితం చేయవచ్చు. యువ నాయకత్వంలో సంస్కరణలతో కూడిన ప్రభుత్వ మౌలిక సదుపాయాల అభివృద్ధి, వాణిజ్య విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వగలదు. ఈ విధానాలు నేపాల్, బంగ్లాదేశ్, భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయగలవు. బంగ్లాదేశ్ రాజకీయ పథం అంతే కీలకమైనది.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
12.03.2026

కవిత 'దీక్ష'.. మరో చరిత్రకు నాంది

కవిత చేపట్టిన ఈ దీక్ష కేసీఆర్ వారసత్వాన్ని కొత్త కోణంలో ఆవిష్కరిస్తోంది. తండ్రిని మించిన తనయగా నిరూపించుకోవాలనే పట్టుదల ఆమెలో స్పష్టంగా కనిపిస్తోంది. వెలుగుమట్ల భూ వివాదం అనేది కేవలం ఒక నెపమే కావచ్చు, కానీ దాని ద్వారా కవిత సాధించాలనుకుంటున్న రాజకీయ లక్ష్యం మాత్రం చాలా పెద్దది. అదే నెరవేరితో మరో చరిత్రకు నాంది.

వెంక గారి భూమయ్య
9848559863

తెలంగాణ రాజకీయ యవనికపై మరోసారి సమరశంఖం పూరించబడింది. దశాబ్ద కాలం పాటు పాలనా పగ్గాలు చేపట్టిన కల్వకుంట్ల కుటుంబం, ఇప్పుడు మళ్ళీ తన పురిటిగడ్డ అయిన పోరాట మార్గాన్ని ఎంచుకుంది. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన నిరవధిక నిరాహారదీక్ష ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. కేవలం ఒక ప్రాంతీయ భూ వివాదంగా కనిపించే ఈ అంశాన్ని, రాష్ట్రస్థాయి రాజకీయ ప్రకంపనగా మార్చడంలో కవిత విజయం సాధించారు. కల్వకుంట్ల కుటుంబ చరిత్రలో ఇది ఒక కొత్త అధ్యాయానికి నాంది ప్రస్తావన అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ దీక్ష కేవలం బాధితుల పక్షాన నిలబడటమే కాకుండా, అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ఒక పక్కా రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది.

వారసత్వ పోరాటం..చరిత్ర పునరావృతమా?

రాజకీయాల్లో వారసత్వం అనేది కేవలం పదవుల ద్వారా వచ్చేది కాదు, అది ప్రజాక్షేత్రంలో చేసే పోరాటాల ద్వారానే సిద్ధిస్తుందని కేసీఆర్ బలంగా నమ్ముతారు. ఇప్పుడు అదే సూత్రాన్ని కవిత అక్షరాలా పాటిస్తున్నారు. 2009 నవంబర్ మాసంలో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష ఏ విధంగానైతే ఆగిపోయిన తెలంగాణ ఉద్యమాన్ని మళ్లీ పట్టాలెక్కించిందో, ఇప్పుడు కవిత దీక్ష కూడా అధికారానికి దూరమైన తమ పార్టీకి ఒక కొత్త ఊపిరిని పోసేలా కనిపిస్తోంది. తండ్రి నీడలో పెరిగిన కవిత, రాజకీయాల్లో వ్యూహరచన ఎంత ముఖ్యమో వంటబట్టించుకున్నారు. అందుకే, అధికార పక్షంపై ప్రజల్లో అసంతృప్తి మొదలైన తరుణంలో, నేరుగా బాధితుల పక్షాన నిలబడి దీక్షకు కూర్చోవడం ద్వారా ఆమె తన రాజకీయ చాతుర్యాన్ని చాటుకున్నారు. ఒక నాయకుడికి ఉండాల్సిన మొండితనం, ప్రజల కోసం ఎంతవరకైనా వెళ్లే తత్వం తనలో ఉన్నాయని ఆమె ఈ పోరాటం ద్వారా నిరూపిస్తున్నారు.

తండ్రి బాటలో తనయ

తండ్రి చంద్రశేఖర రావు రాజకీయ వ్యూహాలను కవిత తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. ఒక మహిళగా నిరవధిక దీక్షకు దిగడం ద్వారా సామాన్య ప్రజల్లో, ముఖ్యంగా మహిళా వర్గాల్లో ఒక రకమైన సానుభూతిని, భావోద్వేగాన్ని కూడగట్టడం ఆమె ప్రధాన లక్ష్యం. "ప్రజా ప్రభుత్వం" అని చెప్పుకుంటున్న ప్రస్తుత పాలనలో పేద రైతుల భూములకు రక్షణ లేదని చిత్రీకరించడం ద్వారా, అధికార పక్షాన్ని ఆత్మరక్షణలో పడేశారు. పార్టీ ఓటమి తర్వాత కుంగిపోయిన కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి, ప్రత్యర్థుల కోటలో తమ జెండాను బలంగా పాతడానికి ఈ నిరసన ఒక వేదికగా మారింది. ఒక రకంగా చెప్పాలంటే, ఇది తండ్రి నేర్పిన పాఠాలతో ఆడుతున్న ఒక చదరంగం లాంటిది. ప్రజల మనోభావాలను ఎలా అర్థం చేసుకోవాలి, సమస్యను ఎలా తీవ్రతరం చేయాలి అనే విషయంలో కవిత తన తండ్రిని మించిన తనయగా మేధస్సు తాలూకు ఆనవాళ్లు స్పష్టంగా కనిస్తున్నాయి. తెరవెనుక ఉండి పావులు కదపడంలో కేసీఆర్ దిట్ట. ఏయే అస్త్రాలను ఏ సమయంలో ప్రయోగించాలో ఆయనకు బాగా తెలుసు. గత కొన్ని నెలలుగా వ్యక్తిగత విమర్శలు, న్యాయపరమైన వివాదాలతో సతమతమవుతున్న కవితను, మళ్ళీ ప్రజా నాయకురాలిగా ప్రజల ముందుకు తీసుకురావడానికి "నిరాహారదీక్ష" కన్నా శక్తివంతమైన మార్గం మరొకటి లేదనేది సుస్పష్టం. ఇది కేవలం బాధితుల కోసమే కాకుండా, తమపై ఉన్న విమర్శలను తుడిచిపెట్టి, మళ్ళీ పోరాట వీరులనే ముద్ర వేసుకోవడానికి

మారుతున్నారు.

అధికార పక్షానికి సవాలు: వ్యూహాత్మక ఒత్తిడి

ఈ పరిణామం అధికార పార్టీకి ఒక పెద్ద సవాలుగా మారింది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజా నిరసన ఇదే కావచ్చు. ఒకవైపు ప్రజలకు న్యాయం చేస్తామని చెబుతూనే, మరోవైపు భూముల విషయంలో జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కవిత చేస్తున్న ఆరోపణలు సామాన్యుల్లోకి బలంగా వెళ్తున్నాయి. ఇది కేవలం ఒక రాజకీయ లాభం మాత్రమే కాదు, పార్టీ అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్న. కల్వకుంట్ల కుటుంబం మౌనంగా ఉంటే రాజకీయంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని గుర్తించి, మళ్ళీ రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయడం ద్వారా తాము ఇంకా క్రియాశీలకంగానే ఉన్నామని సంకేతాలిస్తున్నారు. ఈ నిరసన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనాపరమైన ఇబ్బందులను సృష్టించడమే కాకుండా, ప్రజల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి ఒక ఆయుధంగా మారింది.

దీక్షా ధీమా వెనుక.. ధైర్యం ఎవరు?

కవిత చూపుతున్న ఈ ధీమా వెనుక కేసీఆర్ రాజకీయ చేస్తున్న ప్రయత్నంగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. కవిత వజ్ర సంకల్పం వెనుక తండ్రి ఇచ్చే ధైర్యం, పార్టీ శ్రేణులు చూపే మద్దతు ఆమెను మరింత మొండిగా ముందుకు నడిపిస్తున్నాయి.

తెలంగాణ రాజకీయాల్లో కొత్త మలుపు

కవిత చేపట్టిన ఈ దీక్ష కేసీఆర్ వారసత్వాన్ని కొత్త కోణంలో ఆవిష్కరిస్తోంది. తండ్రిని మించిన తనయగా నిరూపించుకోవాలనే పట్టుదల ఆమెలో స్పష్టంగా కనిపిస్తోంది. వెలుగుమట్ల భూ వివాదం అనేది కేవలం ఒక నెపమే కావచ్చు, కానీ దాని ద్వారా కవిత సాధించాలనుకుంటున్న రాజకీయ లక్ష్యం మాత్రం చాలా పెద్దది. ఈ పోరాటం కల్వకుంట్ల కుటుంబంలో మరో చరిత్రను లిఖిస్తుందా? లేదా కేవలం ఒక రాజకీయ ప్రయత్నంగానే మిగిలిపోతుందా అన్నది కాలమే నిర్ణయిస్తుంది. అయితే, ప్రస్తుతం జరుగుతున్న ఈ రాజకీయ యుద్ధంలో కవిత మాత్రం తన తండ్రి నేర్పిన పాఠాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తూ, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని మళ్ళీ సుస్థిరం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మనసుతో స్నేహం ప్రశాంత జీవితానికి తొలి అడుగు

డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

మానవ పరిణామ క్రమంలో అత్యంత నిగూఢమైనది, అనంతమైన శక్తి కలిగినది ఏదైనా ఉందంటే అది మనసు మాత్రమే. ఇది కేవలం ఆలోచనల సమ్మేళనం కాదు, మన అస్తిత్వానికి పునాది, మన భవిష్యత్తుకు రూపశిల్పి. ఒకే క్షణంలో మనల్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లగలదు, మరుక్షణమే అగాధంలోకి నెట్టేయగలదు. శతాబ్దాలుగా తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, ఆధ్యాత్మిక గురువులు శోధిస్తున్న ప్రశ్న ఒక్కటే మనసు మనకు ప్రాణ స్నేహితుడా లేక పరమ శత్రువా? దీనికి సమాధానం వెతకడం అంటే మనల్ని మనం గెలవడమే. మనసు అనేది ఒక అద్భుతమైన యంత్రం. కేవలం కొన్ని గ్రాముల బరువున్న మెదడు కణజాలం వెనుక దాగి ఉన్న ఈ శక్తి సామర్థ్యం ఊహాతీతం. గతంలోని తీపి జ్ఞాపకాలను నెమరువేసుకునే సత్తా, వర్తమానంలోని అనుభూతులను ఆస్వాదించే నేర్పు, భవిష్యత్తును ముందుగానే ఊహించి ప్రణాళికలు వేసుకునే తెలివితేటలు ఇవన్నీ మనసు ప్రసాదించిన వరాలే. ప్రపంచంలోని అద్భుత కట్టడాలు, గుండెను హత్తుకునే కళాఖండాలు, మానవ జీవన గతిని మార్చిన శాస్త్రీయ ఆవిష్కరణలు, ఇవన్నీ ఒకప్పుడు ఒక వ్యక్తి మనసులో మొలకెత్తిన చిన్న ఆలోచనలే. ప్రేమ, కరుణ, సానుభూతి వంటి ఉన్నతమైన భావోద్వేగాలకు మనసే నిలయం. మనం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక, మనం నిర్మించుకునే వ్యక్తిత్వం వెనుక ఈ అదృశ్య శక్తి హస్తం ఉంటుంది. అదే మనసు మనకు తెలియకుండానే మనపై యుద్ధం ప్రకటించినప్పుడు జీవితం నరకప్రాయం అవుతుంది. ఒక చిన్న పొరపాటును పదే పదే గుర్తు చేస్తూ, మనం దేనికీ పనికిరామని నూరిపోస్తుంది. గతంలో చిక్కుకుపోవడం, రాత్రి నిశ్శబ్దంగా నిద్రపోవాలని ప్రయత్నించినప్పుడు, ఎప్పుడో పదేళ్ల క్రితం చేసిన తప్పును వెలికి తీసి మనల్ని అపరాధ భావనలో ముంచేస్తుంది. అతిగా ఆలోచించడం (Overthinking), జరగని ప్రమాదాల గురించి ఊహించుకుంటూ ప్రస్తుత క్షణాన్ని విషతుల్యం చేస్తుంది. ఒక చిన్న సమస్యను భూతద్దంలో చూపిస్తూ, ఆందోళనను (Anxiety) పెంచుతుంది. పోలికల ఉచ్చు, పక్కవాడికి ఉన్నది మనకు లేదని, ఇతరుల జీవితాలు మనకంటే బాగున్నాయని నిరంతరం పోల్చుకుంటూ మనల్ని అసంతృప్తి వైపు నడిపిస్తుంది.

ఇది మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఈ దశలో మనసు ఒక చంచలమైన కోతి లాగా వ్యవహరిస్తుంది. నియంత్రణ లేని మనసు ఒత్తిడికి, మానసిక కుంగుబాటుకు (Depression) ప్రధాన కారణమవుతుంది. మనం వర్తమానంలో జీవించకుండా, లేని భయాల వెనుక పరుగెత్తేలా చేస్తుంది. అయితే, ఇదే మనసును మనం సరైన దిశలో మలుచుకోగలిగితే, అది ప్రపంచంలోనే అత్యుత్తమ గురువుగా మారుతుంది. జీవిత పాఠాలను బోధించడంలో దీనికి సాటి మరొకటి లేదు. ఆత్మపరిశీలన (Self Reflection), మనసు మనకు అద్దం లాంటిది. మనం ఎవరు? మన బలహీనతలు ఏమిటి? మనం ఏ దిశగా వెళ్తున్నాం? అనే ప్రశ్నలకు సమాధానాలు మనసు అంతరాలలోనే దొరుకుతాయి. ఒక రచయిత తన మనోఫలకంపై ప్రపంచాలను సృష్టిస్తాడు, ఒక శాస్త్రవేత్త అసంభవాన్ని సుభవం చేసే మార్గాన్ని కనుగొంటాడు. స్థితిస్థాపకత (Resilience), జీవితం దెబ్బతీసినప్పుడు, మళ్లీ లేచి నిలబడమని ప్రేరేపించేది మనసే. ఓటమిని అంగీకరిస్తూనే, దాన్ని ఒక పాఠంగా మార్చుకుని ముందుకు సాగమని బోధించే గొప్ప గురువు మన అంతరాత్మ. భావోద్వేగ మేధస్సు (EQ), మన భావాలను గుర్తించి, వాటిని నియంత్రించడం ద్వారా ఇతరులతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలో మనసు మనకు నేర్పిస్తుంది. మనసును గెలవడం అంటే ప్రపంచాన్ని గెలవడమే అంటారు పెద్దలు. ఈ మార్పు ఒక్క రోజులో వచ్చేది కాదు, కానీ నిరంతర సాధనతో సాధ్యమే. అవగాహన (Awareness), మన మనసులో ఎలాంటి ఆలోచనలు వస్తున్నాయో గమనించాలి. ఒక సాక్షిలా (Observer) మన ఆలోచనలను చూడటం నేర్చుకోవాలి. ఏది నిజం? ఏది మనసు సృష్టించిన భ్రమ? అని విశ్లేషించాలి. సానుకూల ధృవీకరణలు (Positive Affirmations), నేను చేయలేను అనే ప్రతికూల వాక్యాన్ని నేను నేర్చుకోగలను అని మార్చుకోవాలి. మన మనసుకి ఇచ్చే ఆదేశాలే మన జీవితాన్ని నిర్దేశిస్తాయి. ధ్యానం.. రోజూ కనీసం 1520 నిమిషాల పాటు ప్రశాంతంగా కూర్చుని శ్వాసపై ధ్యాస పెట్టడం వల్ల చంచలమైన మనసు నిశ్చలమవుతుంది. ఇది మనసుపై మనకు పట్టునిస్తుంది. కృతజ్ఞత (Gratitude), మనకు లేని దాని గురించి బాధపడటం మానేసి, మనకు ఉన్న చిన్న చిన్న విషయాల పట్ల కృతజ్ఞత కలిగి ఉండటం వల్ల మనసు సానుకూలత వైపు మళ్లుతుంది. నేటి న్యూరోసైన్స్ (Neuroscience) పరిశోధనలు న్యూరోప్లాస్టిసిటీ గురించి చెప్తున్నాయి. అంటే, మన ఆలోచనా విధానాన్ని మార్చుకోవడం ద్వారా మెదడులోని నాడుల అమరికను కూడా మార్చవచ్చని శాస్త్రీయంగా నిరూపితమైంది. పురాతన భారతదేశంలో భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు నేటికీ ఆచరణీయం, బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః (ఎవరైతే తన మనసును జయించారో వారికి మనసే బంధువు/స్నేహితుడు, లేని పక్షంలో అది శత్రువులా ప్రవర్తిస్తుంది). మనసు ఒక అద్భుతమైన సేవకుడు, కానీ చాలా ప్రమాదకరమైన యజమాని. మనం మనసు చెప్పినట్లు వింటే అది మనల్ని ఎటో తీసుకెళ్తుంది. కానీ మనసును మన నియంత్రణలోకి తెచ్చుకుంటే అది ఒక దివ్యౌషధంగా మారుతుంది. కాబట్టి, నేటి నుండే మీ అంతరంగాన్ని గమనించడం మొదలుపెట్టండి. ప్రతి ఆలోచననూ ప్రశ్నించండి. ప్రతికూలతను సానుకూలతతో జయించండి. గుర్తుంచుకోండి, మీ మనసును మలచుకునే శిల్పి మీరే. అది మిమ్మల్ని పాతాళానికి తొక్కే శత్రువుగా ఉండాలా లేక ఉన్నత శిఖరాలకు చేర్చే గురువుగా ఉండాలా అన్నది మీ చేతుల్లోనే ఉంది.

ఏపీలో బిహార్ మోడల్.. బీజేపీ ప్లాన్!?

అంబీర్ శ్రీకాంత్
8185968059

ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీయైన బీజేపీ..నరేంద్రమోడీ నాయకత్వంలో దేశంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, గతంతో పోలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికలలో మిత్రపక్షాల మద్దతుతోనే పవర్‌లోకి వచ్చింది. 303 సీట్ల నుంచి240 సీట్లకు పడిపోయింది. బిహార్‌లోని జేడీయూ, ఏపీలోని టీడీపీ కీలకమైన పక్షాలుగా మారాయి. ఎన్డీయేలో పవర్ ఫుల్ లీడర్లుగా నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు నిలిచారు. కానీ, తాజాగా అత్యధిక కాలంముఖ్యమంత్రిగా ఉన్న దేశంలోనే సీనియర్ పొలిటీషియన్ నితీశ్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా వెళ్లాలనే నిర్ణయంతో నామినేషన్ దాఖలు, ఎన్నిక లాంఛనం కావడం రాజకీయాల్లో సంచలనంగా మారింది. ముఖ్యంగా ఇది కమలనాథుల పాచికగా, మోడీ షా మార్క్ పాలిటిక్స్‌గా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రిగా ఉండాల్సిన తమ నాయకుడు.. రాజ్యసభ సభ్యుడిగా వెళ్లడం జేడీయూ శ్రేణులకు మింగుడుపడటం లేదు. నితీశ్ కుమార్ తనయుడు ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత ముఖ్యమంత్రిగా కాబోతున్నారనే వార్తలొస్తున్నాయి. దీంతో మేజర్ పార్ట్‌నర్ కాస్తా జూనియర్ పార్ట్‌నర్ అయి ఆరోవేలుగా ఉండే డిప్యూటీ సీఎం పోస్టు తీసుకుంటున్నట్లుగా చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలోనే బిహార్ మోడల్ విభజతి ఏపీలోనూ ఇంప్లిమెంట్ చేసేలా స్కోప్ ఉన్నట్టు వాదనలు కొనసాగుతున్నాయి.

ఇప్పట్లో కష్టమే?

బిహార్ తరహాలో బీజేపీకి ఏపీలో నాయకులు లేకపోవడమే కాదు.. ఎన్డీయే కూటమిలోని చంద్రబాబు, పవన్ కల్యాణ్ క్రియాశీలక రాజకీయాల్లో తమ భూమికను శక్తిమంతంగా పోషిస్తున్నారు. మరో 15 ఏళ్ల పాటు చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉంటారని పవన్ పేర్కొనడం..టీడీపీలో సమర్థులైన నాయకులు, చంద్రబాబుకు రాజకీయ వారసుడిగా నారా లోకేశ్ ముందుకు వస్తుండటం.. పవన్ కల్యాణ్ సైతం రాజకీయంగా బలమైన ప్రభావం చూపడం వంటి అంశాలన్నింటినీ పరిశీలిస్తే.. ఇప్పట్లో బీజేపీ .. బిహార్ మోడల్‌ను ఏపీలో అనుసరించే అంశం పక్కనపెట్టే విషయమేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. వయసురీత్యా బిహార్ సీఎంగా ఉన్న నితీశ్ కుమార్ యాక్టివ్ పాలిటిక్స్‌లో కొంతకాలం పాటే మనగలుగుతారనే వార్తలున్న క్రమంలో, ఆ వాదనకు బలం చేకూరేలా ఆయన తాజాగా రాజ్యసభకు వెళ్లేలా నిర్ణయం తీసుకున్నట్లు కనబడుతున్నది. అయితే, ఏపీలో మాత్రం టీడీపీ అధినేత చంద్రబాబు మరో టర్మ్ కూడా సీఎంగా పని చేయగల శక్తిమంతుడిగా కనిపిస్తున్నారు. చంద్రబాబు వారసుడిగా లోకేశ్ ఉండటం, జనసేన అధినేత పవన్కల్యాణ్ సైతం డిప్యూటీ సీఎంగా సమర్థవంతంగా పనితీరు కనబరచడం వంటి అంశాలు కనిపిస్తున్నాయి. అయితే, భవిష్యత్ రాజకీయాలలో ఎంతటి మార్పులు జరిగినా ఏపీలో బీజేపీకి ఇంకా పాగా వేసే అంతలా క్షేత్రస్థాయిలో పరిస్థితులు లేనట్లే కనిపిస్తోంది.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008



స్పీకర్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం

- మూజువాణి ఓటుతో లోక్‌సభలో తిరస్కరణ
- అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 11: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బుధవారం లోక్‌సభలో వీగిపోయింది. సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య మూజువాణి ఓటుతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఓటింగ్ అనంతరం సభ వాయిదా పడింది. లోక్‌సభ గురువారం ఉదయం 11 గంటలకు తిరిగి సమావేశమవుతుంది. నిష్పాక్షికంగా సభను నిర్వహించడంలో స్పీకర్ ఓం బిర్లా విఫలమయ్యారని ఆరోపిస్తూ విపక్షం ఆయనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ ఆరోపణలను ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. గురువారం సభలో ఓం బిర్లా స్పీకర్ స్థానంలో ఆసీనులవుతారు. విపక్ష సభ్యుల ప్రవర్తనపై ఆయన సభలో ఓ ప్రకటన చేయనున్నారు. పార్లమెంట్ లో అసమ్మతికి స్థానం తగ్గిపోతున్నదని పేర్కొన్న విపక్ష సభ్యులు అధికార పక్షం పట్ల స్పీకర్ పక్షపాత వైఖరిని ఖండించేందుకే తాము ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. స్పీకర్ నుంచి తమకు తగినంత రక్షణ లభించడం లేదని విపక్ష సభ్యులు తరచు భావిస్తున్నట్లు ఆర్‌జేడీ ఎంపీ అభయ్ కుమార్ సిన్హా చర్చ సందర్భంగా లోక్‌సభలో తెలిపారు. సభ స్వతంత్రతకు స్పీకర్ ప్రాతినిధ్యం వహించడం లేదని, ఆయన అధికార పార్టీ దౌర్జన్యానికి చిహ్నంగా మారిపోయారని సిన్హా ఆరోపించారు. ఒకే రోజు 140 మందికిపైగా ఎంపీలను సస్పెండ్ చేసిన రోజున కూడా సభ బ్లాక్ డే చూసిందని, తమ గొంతు కూడా వినాలని పేదలు, బలహీనులు భావించిన రోజే నిజమైన ప్రజాస్వామ్యమని ఆయన చెప్పారు. విపక్ష ఎంపీలు సభలో మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రతి సారీ స్పీకర్ నుంచి వద్దు.. వద్దు.. వద్దు అన్న మాటలే పదేపదే వస్తాయని ఆయన చెప్పారు. విపక్ష సభ్యుల ప్రసంగాలకు అడ్డు తగలడం సభలో నిత్యకృత్యంగా మారిపోయిందని జేఎంఎం ఎంపీ విజయ్ కుమార్ హన్స్‌దక చెప్పారు. అవిశ్వాస తీర్మానం వీగిపోతుందని తెలిసినా పార్లమెంట్‌లో ప్రజాస్వామిక హక్కుల గురించి తమ ఆందోళనపై చర్చించే అవకాశాన్ని తాము కోరుకున్నామని ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ బజరంగ్ అన్నారు. అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం పార్లమెంటరీ రాజకీయాల్లో బాధాకర చర్యగా ఆయన అభివర్ణించారు.

‘హర్మూజ్’ వద్ద భీకర యుద్ధం

మొదటిపేజీ తరువాయి

నౌకలపై దాడులకు పాల్పడుతోంది. తాజాగా ఓ కార్గోషిప్‌పై క్షిపణిదాడి జరిగిందని, దీనితో ఆ నౌక పూర్తిగా దగ్ధమైందని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. ఒమన్‌కు ఉత్తరాన ఉన్న జలసంధిలో ఈ ఘటన జరిగినట్లు పేర్కొంది. అంతకు ముందు యూఏఈ రాస్ అల్‌ఖైమా సమీపంలో ఒక నౌకపై డ్రోన్ దాడి జరిగినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ వెల్లడించింది. ఈ డ్రోన్ దాడిలో ఆ కంటైనర్ నౌక ధ్వంసమైనట్లు తెలిపింది. పైగా ఈ జలసంధిలో ఇరాన్ మందుపాతరలు అమరుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఇండియా వస్తున్న థాయిలాండ్ నౌకపై దాడి

"తాజాగా హర్మూజ్ జలసంధి నుంచి భారత్ దిశగా వస్తున్న థాయిలాండ్‌కు చెందిన 'మయూరీ నారీ' అనే కార్గో నౌకపై దాడి జరిగింది. అది యూఏఈలోని ఖలీఫా పోర్టు నుంచి గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు బయలుదేరింది. హర్మూజ్ మీదుగా వస్తున్న సమయంలో దానిపై దాడి జరిగింది. ఈ దాడికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నాం. ఒమన్ నౌకాదళం ఆ కార్గో షిప్‌లోని 20 మంది నావికులను రక్షించింది. కానీ ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. వారి ఆచూకీ గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని రాయల్ థాయ్ నేవీ పేర్కొంది. అంతేకాదు ఆ నౌక నుంచి దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యాలను విడుదల చేసింది. కాగా ఈ దాడి చేసినట్లు ఇప్పటి వరకు ఏ గ్రూప్ ప్రకటించలేదు. అయితే ఇది ఇరాన్ చేసిన దాడి అంటూ మీడియాలో వార్తలు వస్తున్నాయి.

ఇరాన్ నౌకలను ముంచేస్తున్న అమెరికా

హర్మూజ్ జలసంధిలో మందుపాతరలు అమర్చేందుకు ఇరాన్ పలు నౌకలను ఉపయోగిస్తోంది. అందుకే వాటిని లక్ష్యంగా చేసుకుని అమెరికన్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఇప్పటికే తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన డజనకు పైగా మైన్‌లేయింగ్ నౌకలను ధ్వంసం చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతేకాదు ఈ హర్మూజ్ జలసంధిలో పేలుళ్లు సృష్టించడానికి ఇరాన్ ప్రణాళికలు వేస్తున్నట్లు ఆరోపించింది.

పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయని ట్రంప్ వార్నింగ్

మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. జలసంధి సమీపంలో ఇరాన్ ఎక్కడైనా మైన్స్‌ను అమర్చినట్లయితే వాటిని తక్షణమే తొలగించాలని ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. లేదంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా మునుపెన్నడూ చూడని స్థాయిలో ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ స్వయంగా వాటిని తీసేస్తే మంచి పరిణామం అని అభిప్రాయపడ్డారు. లేదంటే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన క్షిపణులను వాడి జలసంధిలోని మైన్‌లేయర్స్ పడవలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేశారు. ట్రంప్ హెచ్చరికల తర్వాత ఇరాన్ మైన్‌లేయర్స్‌ను ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

ఇకపై అమెరికన్ టెక్ కంపెనీలే మా లక్ష్యం- : ఇరాన్

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై ప్రతీకార దాడులు చేస్తూ చమురు ధరలకు ఆజ్యం పోసిన ఇరాన్, ఇప్పుడు టెక్ సంస్థలను లక్ష్యంగా చేసుకోనున్నట్లు ప్రకటించింది. సాంకేతిక పరిజ్ఞానం అందిస్తూ, యుద్ధంలో ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్నాయనే కారణంతో పశ్చిమాసియాలో ఉన్న గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎమ్, ఎన్‌వీడియా వంటి దిగ్గజ సంస్థల మౌలిక వసతులను ధ్వంసం చేయాలని నిర్ణయించింది. అంతేకాదు, ఇకపై గల్ఫ్ దేశాల్లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై గురిపెట్టనున్నట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది.

300 బాలిస్టిక్ క్షిపణులతో దాడి!

ఇరాన్ తమపై 300 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని, వాటిలో దాదాపు సగం క్లస్టర్ బాంబు వార్‌హెడ్‌లను కలిగి ఉన్నాయని ఇజ్రాయెల్ రక్షణ దళాలు పేర్కొన్నాయి. మంగళవారం నాడు చాలా జరిగిన ఈ దాడిలో చాలా క్షిపణులను తాము అడ్డుకున్నామని పేర్కొంది. అయితే ఒక క్షిపణి మాత్రం జెరూసలెం సమీపంలోని బీట్ షెమెస్ సమీపంలోని పడి పేలిపోయిందని ఐడీఎఫ్ తెలిపింది.

ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగిస్తాం : ట్రంప్ కీలక ప్రకటన

ఇరాన్‌పై యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అతిత్వరలోనే ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగిస్తామని ప్రకటించారు. తాము ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు యుద్ధం ఆపగలమని పేర్కొన్న ఆయన ఇరాన్‌ను అనుకున్నదానికంటే ఎక్కువే నష్టపరిచినట్లు తెలిపారు. ఇకపై తాము ఇరాన్‌లో ఛేదించాల్సిన లక్ష్యాలేమీ లేవని డొనాల్డ్ ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. 'ఇరాన్‌లో అమెరికా సేనలు ఊహించిన దానికంటే ఎక్కువ విధ్వంసం సృష్టించాయి. ఇరాన్‌తో యుద్ధంలో మా ప్రణాళిక కంటే ముందున్నాం. ఆరువారాల్లో సృష్టిస్తామన్న విధ్వంసాన్ని, అంతకన్నా ముందే, అంత కంటే ఎక్కువే చేశాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

దేశంలోనే తొలిసారి
కారుణ్య మరణానికి ‘సుప్రీం’ అనుమతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి11 : కారుణ్య మరణం అంశంపై సుప్రీంకోర్టు మొదటిసారిగా సంచలన తీర్పును వెలువరించింది. 13 ఏళ్లుగా కోమాలో ఉంటూ జీవచ్ఛవంలా ఉన్న ఓ వ్యక్తికి కారుణ్య మరణానికి అనుమతి ఇచ్చింది. అతడికి ప్రాణాధార చికిత్స వ్యవస్థలను తొలగించేందుకు అంగీకరించింది. తన కుమారుడికి కారుణ్య మరణాన్ని ప్రసాదించాలంటూ ఆ వ్యక్తి తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్ పైబుధవారం ఈమేరకు తీర్పును వెలువరించింది. గౌరవంగా మరణించే హక్కును గుర్తిస్తూ 2018 కామన్ కాజ్ కేసు తీర్పును తొలిసారిగా అమలు చేస్తున్నట్లు జస్టిస్ జేబీ పార్దీవాలా, కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. దిల్లీకి చెందిన హరీశ్ రాణా గత 13 సంవత్సరాలుగా కోమాలోనే ఉన్నాడు. 2013 ఆగస్టు 20న చండీగఢ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. తన వసతి గృహ భవనం నాలుగో అంతస్తు నుంచి కిందకు పడిపోవడంతో తలకు తీవ్రంగా గాయమైంది. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స అందించినా ఉపయోగం లేకుండా పోయింది. అతడి శరీరంలో ఎలాంటి మార్పు కన్పించలేదు. ఇక అప్పటి నుంచి హరీశ్ జీవచ్ఛంలా పూర్తిగా మంచానికే పరిమితయ్యాడు. ఇంట్లోనే ఉంటి హరీశ్‌ను చూసుకుంటున్నారు. శస్త్రచికిత్స ద్వారా అమర్చిన పీఈజీ ట్యూబ్ ద్వారా క్లినికల్‌గా అందించే పోషకాహారం ద్వారా మాత్రమే జీవిస్తున్నాడు. హరీశ్ చికిత్స కోసం ఆర్థికంగా, మానసికంగా అతడి తల్లిదండ్రులు కుంగిపోయారు. హరీశ్‌కు కారుణ్య మరణానికి అనుమతించాలంటూ 2024లో దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఆ తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లినా నిరాశే ఎదురైంది. తాజాగా హరీశ్ కోలుకునే అవకాశం లేదని ఎయిమ్స్ వైద్య బృందం నివేదిక ఇవ్వడంతో అతడి తల్లిదండ్రులు మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

కుటుంబ సభ్యులతో న్యాయమూర్తులు భేటీ

మెడికల్ రిపోర్ట్‌లను పరిశీలించిన సుప్రీంకోర్టు హరీశ్ కేసును విచారించేందుకు అంగీకరించింది. ఈ ఏడాది జనవరి 13న న్యాయమూర్తులు, హరీశ్ తల్లిదండ్రులను వ్యక్తిగతంగా కలిసి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అప్పుడు మర్యాదపూర్వక చావును ప్రసాదించాలని కోరారు. ఈ కేసులో ప్రాణాధార వైద్య చికిత్సను ఉపసంహరించే విషయాన్ని మాత్రం తాము పరిశీలిస్తామంటూ తీర్పును రిజర్వు చేసింది. తాజాగా హరీశ్‌కు కారుణ్య మరణానికి అనుమతిస్తూ జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. ఈ సందర్భంగా హరీశ్ కుటుంబాన్ని ప్రత్యేకంగా ప్రశంసించింది. తల్లిదండ్రులు, సోదరులు హరీశ్ ఎప్పుడూ ఒంటరిగా వదిలిపెట్టలేదని, అపారమైన ప్రేమ, సహనంతో చూసుకున్నారని తెలిపింది. జీవితం, ప్రేమ, నష్టం ఇలా వీటన్నింటిని పక్కనపెడితే, వాస్తవ పరిస్థితుల ఆధారంగా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని వ్యాఖ్యలు చేసింది.

కారుణ మరణం కోసం మార్గదర్శకాలు

2011లో తొలిసారిగా సుప్రీంకోర్టు కారుణ్య మరణం అంశంపై విచారణ జరిపించింది. అప్పుడే దీనిని చట్టబద్ధంగా గుర్తిస్తూ పలు మార్గదర్శకాలు రూపొందించింది. కారుణ్య మరణం కోరే వ్యక్తికి నేరుగా ప్రాణం పోయేవిధంగా సూది మందులు, ఔషధాలు ఇవ్వకుండా చికిత్సను నిలిపివేసి సహజ మరణం ప్రసాదించాలి పేర్కొంది. అందుకు బాధిత వ్యక్తి తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి లేదా దగ్గరి బంధువుల అనుమతి తప్పనిసరి అని తెలిపింది. వారెవరూ లేకపోతే నెక్ట్ ఫ్రెండ్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పింది. ఆ తర్వాత 2018లో సుప్రీంకోర్టులో మరోసారి కారుణ్య మరణం అంశంపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా గౌరవప్రదంగా మరణించడం అనేది ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఈ కారుణ్య మరణాన్ని అధికారికంగా చట్టబద్ధం చేసింది. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగానే హరీశ్ రాణా కేసులో సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది.

హుస్నాబాద్ గౌరవం పెంచేలా మున్సిపల్ పాలకవర్గం పనిచేయాలి

- 99 రోజుల ప్రణాళికపై అవగాహన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 11: హుస్నాబాద్ పట్టణ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం'పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో తాను ఎంపీగా ఉన్న కాలంలోనే హుస్నాబాద్‌ను నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయించామని, ప్రస్తుతం పట్టణాన్ని 'క్లీన్ అండ్ గ్రీన్'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 10 అంశాలతో కూడిన 99 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా హుస్నాబాద్‌లో విద్యా, వైద్య, పర్యాటక రంగాలను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగానే 250 పడకల ఆసుపత్రి, ఇంజినీరింగ్ కళాశాల, అర్బన్ పార్కు వంటి పనులు చేపట్టామన్నారు. ముఖ్యంగా 12, 13 వార్డుల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, ప్రజలపై అదనపు భారం పడకుండా మున్సిపల్ ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా ఆదాయం పెరిగేలా బ్యాంకు లింకేజీలు అందించామని, ప్లాస్టిక్ నివారణకు స్టీల్ బ్యాంకులను వినియోగించాలని కోరారు. అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ... పారిశుధ్యం, పచ్చదనం లక్ష్యంగా ప్రజాపాలన సాగాలని, ఈనెల 12న సిద్దిపేటలో ప్రజాప్రతినిధులకు నిర్వహించే ఓరియంటేషన్ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని, 14 నుంచి 15 ఏళ్ల లోపు బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా టీకాలు వేయించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ పనులను పరిశీలించిన అధికారులు

ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి , మార్చి 11: ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి ఐఏఎస్, .మేనేజింగ్ డైరెక్టర్ మరియు హౌసింగ్ కార్యదర్శివి.పి.గౌతమ్ తో కలిసి బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఆరుట్ల గ్రామంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అభినందించారు. హుజూర్ నగర్ 2 బెడ్‌హోమ్ హౌసింగ్ కాలనీలో కూడా అదే మోడల్ స్కూల్ నిర్మించబడుతుందని చెప్పారు. అనంతరం ఆరుట్ల గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను కూడా తనిఖీ చేసి, లబ్ధిదారులు మరియు ప్రేరేపిత లబ్ధిదారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో నిర్మాణ వ్యయాన్ని ఎలా తగ్గించాలో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విద్యా కమిషన్ చైర్‌పర్సన్ అకునూరి మురళి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి , పిడి హౌసింగ్ చంపా నాయక్ ,ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓ కె.అనంత్ రెడ్డి, ఇందిరమ్మ సభ్యులు ఉన్నారు.

కనకమామిడి గ్రామంలో శుభ్రత కార్యక్రమం

- ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 11: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మండలం పరిధిలోని కనకమామిడి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి పాల్గొని గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో శుభ్రపరిచే పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లను శుభ్రపరచడం, డ్రైనేజీలలో పేరుకుపోయిన మురుగును తొలగించడం, కాలువలను శుభ్రం చేయించడం వంటి పనులు చేపట్టారు. అలాగే వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు డ్రైనేజీ ప్రాంతాల్లో క్లీనింగ్ పౌడర్ చల్లడం, సున్నం వేయడం వంటి చర్యలు కూడా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు మహేష్ యాదవ్, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేశారు. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు అందరూ కలిసి పనిచేయాలని సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

“

స్కూళ్లు, ఆస్పత్రులకు అంతరాయం లేకుండా గ్యాస్ సరఫరా జరగాలి. రాష్ట్రంలో ప్రస్తుతం కొరత లేదు. కేంద్రంతో మాట్లాడి ఇబ్బందులు రాకుండా చూడాలి. గుడ్లు, అరటి లాంటి ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతకాలి. సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా నిఘా పెట్టాలి.

- కలెక్టర్ల సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

యాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

- నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 11: ఇటీవల వివాహం చేసుకున్న నూతన వధూవరులను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆశీర్వదించారు. జిహెచ్ఎంసి బడంగ్ పేట డివిజన్ నాదర్ గుల్ గ్రామంలో పర్యటించిన కేఎల్ఆర్ పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. తొలుత బంగారి శ్రీనివాస్ నివాసానికి వెళ్లి కుమార్తె మాధురి కార్తీక్ ను పలకరించారు. నిండునూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. అంతకు ముందు తుక్కుగూడలో పెళ్లి కొడుకుకు అభినందనలు తెలిపారు. అనంతరం రెండ్రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన పెత్తుల యాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కుమారుడికి మనోధైర్యం ఇచ్చి... కాసేపు పెత్తుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. యాదిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సహా నాదర్ గుల్ వాసులు పాల్గొన్నారు.

ఇళ్లల్లో నివాసం ఉండడం లేదంటూ

కుంటి సాకులతో ఇళ్ల పట్టాలను రద్దు చేస్తే ఉద్యమం

- గత రెండేళ్లలో నిధుల కేటాయింపులో పూర్తి నిర్లక్ష్యం.
- పేదోడి సొంతింటి కలను సాకారం చేసిన ప్రత్యక్ష దైవం కెసిఆర్.
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నివాసితుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం.
- అధైర్యపడకండి బీఆర్ఎస్ అండగా ఉంటుంది.
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి హరీష్ రావు తో కలిసి పాల్గొన్నఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11 : గత రెండేళ్లలో పటాన్ చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని, ఇప్పటిదాకా ఒక లెక్క అని ఇప్పటి నుండి మరో లెక్క అని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో గల కెసిఆర్ డబుల్ బెడ్ రూమ్ ఫేస్ 2 కాలనీలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లలితా సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక వసతులతో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నిరుపేదల కోసం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నాడు కెసిఆర్ నాయకత్వంలో చేసిన అభివృద్ధి పనులు తప్ప, గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసింది ఏమీ లేదని విమర్శించారు. పటాన్ చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం కెసిఆర్ ప్రభుత్వం 475 కోట్ల రూపాయలు కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేయడం జరిగిందని అన్నారు. ఇళ్లల్లో నివాసం ఉండడం లేదంటూ కుంటి సాకులతో ఇళ్ల పట్టాలను రద్దు చేస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. లబ్ధిదారులు ఎట్టి పరిస్థితుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను విక్రయించ వద్దని విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో మతపరమైన ప్రార్థనా సలాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు పేదల పక్షాన అండగా ఉంటుందని.. ఏ సమస్య వచ్చినా పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్ర నాయకులకు శుభలేఖను అందజేసిన ఈశ్వర్ ముదిరాజ్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 11: రాష్ట్ర క్రీడలు పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిడి శ్రీహరి ముదిరాజ్ కి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ కి మరియు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. కి పెండ్లి పత్రిక ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి ఈశ్వర్ ముదిరాజ్ తమ కుమారుడి వివాహమునాకు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు గదగూటి హరికృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం

- బైరాగిగూడా సర్పంచ్ పల్స కృష్ణ గౌడ్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి11: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూర్ మండల కేంద్రంలోని బైరాగి గూడా గ్రామ సర్పంచ్ ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా.. గ్రామంలో డంపింగ్ యార్డ్ సుప్రపరచడం చెట్ల పెంపకాలను పరిశీలించారు. తడి చెత్త పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పల్స కృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధులను దరిచేరకుండా వార్డును అభివృద్ధి పరచుకోవాలని ప్రజలను కోరారు.ఈ యొక్క కార్యక్రమంలో వార్డు సభ్యులు యాచారం లత, ఎలిమినేటి వినోద, ఇసంపాలి మంజుల, దేవేందర్, కిరణ్, ఇమ్రాన్, భగవత్, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ బాబు, వాటర్ లైన్మెన్ యాచారం అనిల్, గ్రామ పెద్దలు గ్రామ సిబ్బంది యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

నందుపల్లిలో ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

- సర్పంచ్ దేశపాగ నరసింహ

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 11: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం నందుపల్లి గ్రామ పంచాయతీలో ప్రజల కనీస సౌకర్యాలైన పారిశుధ్యం, నీటి సరఫరా, విద్యుత్ దీపాల పనితీరు మెరుగుపరచడం ద్వారా వార్డుల వారీగా సమస్యలు పరిష్కరించేందుకు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిందనీ మహేశ్వరం మండలం నందుపల్లి గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ పేర్కొన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రతి ప్రణాళిక ప్రభుత్వ కార్యక్రమంలలో తదితర గ్రామ వార్డు సభ్యులతో కలిసి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రకృతి పల్లెవనం, అదేవిధంగా రోడ్లు, వీధులు అనేక వాడల్లో పెద్ద ఎత్తున పరిశుద్ధ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. బడి గుడి పరిసరాల్లో కూడా ముమ్మర పరిశుద్ధ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అదే విధంగా గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక చర్యలలో భాగంగా అన్ని వార్డులలో ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ''ప్రజాపాల నప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల స్పెషల్ డ్రైవ్ చేప దుతుండగా, శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలో ప్రణాళిక అమలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ షేక్ ఎజాస్, వార్డు సభ్యులు కల్వకోల్ మహేందర్, రంగుల రవి, ఆకన్పల్లి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి ఎస్ జానయ్య, పంచాయతీ కార్మిక సిబ్బంది గ్రామ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున ఈ యొక్క అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు అని పత్రిక విలేకరులకు తెలియజేశారు

నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో

డ్రైనేజీ సమస్యలపై జీహెచ్ఎంసీకి వినతి

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, మార్చి 11 : నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నివాస్ జర్నలిస్ట్స్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్, నిజాంపేట్ సర్కిల్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కాలనీలో గత కొంతకాలంగా డ్రైనేజీ పైపులు తగిన సామర్థ్యం లేకపోవడం వల్ల వర్షాకాలంలో మురుగు నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తోందని, డ్రైనేజీ లైన్లను పెద్దవి చేసి మార్పులు చేయాలని వారు కోరారు. అదేవిధంగా కాలనీలో వీధి దీపాలు సరిగా పనిచేయకపోవడం, రోడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు కాలనీ ఏర్పడినప్పటి నుంచి మౌలిక వసతుల సమస్యలు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ సరైన విధంగా లేకపోవడం వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు పడిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాలనీలో సమగ్రంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి, మురుగు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు.

గాత్ర సంస్కృతిపై గీతం విద్యార్థులకు అవగాహన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11 : గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్), హైదరాబాదులోని కళలు, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో బుధవారం గాన సంస్కృతి (వాయిస్ కల్చర్)పై హైబ్రిడ్ విధానంలో కార్యశాల నిర్వహించారు. చెన్నైలోని కే.ఎం. మ్యూజిక్ కన్జర్వేటరీ (ఏ.ఆర్. రెహమాన్ ఫౌండేషన్) లోని హిందూస్థానీ మ్యూజిక్ ఫ్యాకల్టీ డాక్టర్ హంబుల్ షైన్ ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్నారు. దీనిని ఆయన ఆన్ లైన్ లో నిర్వహించి, స్వర శిక్షణ యొక్క శాస్త్రీయ, కళాత్మక అంశాలపై విలువైన అంతర్దృష్టులను విద్యార్థులకు అందించారు. ఒక గాయకుడు తమ గొంతును ఉపయోగించే వివిధ స్థాయిలు లేదా శ్రేణులు (రేంజెస్) గొంతు కదలికలు, నాణ్యతలో మార్పులను బట్టి మారతాయని హంబుల్ షైన్ చెప్పారు. ఛాతీ స్వరం (ఛెస్ట్ వాయిస్) తక్కువ స్థాయి స్వరాలు, మధ్యమ స్థాయి, హెచ్చు స్థాయి స్వరాలు (హెడ్ వాయిస్), సాధారణ స్వరాలు (ఫాల్సెట్టో), అత్యంత హెచ్చు స్వరస్థాయి లేదా ఈల వంటి ధ్వని (విజిల్ రిజిస్టర్)లతో సహా వివిధ స్వర స్థాయిల గురించి ఆయన వివరించారు. గాయకులు రాగాలను తగిన స్వర శ్రేణిలో ఎలా సమర్థవంతంగా పాడగలరో తెలుపుతూ, అదే సమయంలో స్వరంలో హెచ్చుతగ్గులు (మాడ్యులేషన్), స్వరాన్ని స్పష్టంగా లేదా దూరం వరకు వినిపించేలా (ప్రొజెక్షన్) చేసే నియంత్రణా పద్ధతులను కూడా ప్రదర్శించారు. ఈ కార్యశాలలో సందర్భాను సారం శైలి (రిజిస్టర్ బ్లెండ్), రెండు అచ్చులు కలిసి ఒకే శబ్దాన్ని పలికే విధానం (వోవల్ బ్లెండ్) వంటి స్వర మిశ్రమ పద్ధతులను కూడా వివరించారు. ఇవి గానంలో శబ్ద సమతుల్యత (టోనల్ బ్యాలెన్స్), సున్నితమైన పరివర్తనలను సాధించడానికి అవసరమన్నారు. సాంకేతిక అంశాలతో పాటు, గానం యొక్క మానసిక కోణాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. గాత్ర ప్రదర్శనలో మానసిక సంసిద్ధత, నిరీక్షణ, ఏకాగ్రత, భావోద్వేగ సంబంధం యొక్క ప్రాముఖ్యతలను విశదీకరించారు. ఈ కార్యశాల చివర్లో విద్యార్థులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకోవడానికి ప్రోత్సహించారు. ఆయన చేసిన ఆచరణాత్మక సూచనలు, ప్రభావవంతమైన స్వర స్థాయిల యొక్క సూక్ష్మ నైపుణ్యాలను అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు సహాయపడింది. ఈ కార్యశాలను లలిత, ప్రదర్శన కళల విభాగ అధ్యాపకులు ఆనందు మురళి, దర్భా మృదు రవళి నిర్వహించి, సమన్వయం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు వృత్తిపరమైన గాత్ర శిక్షణ పద్ధతులకు విలువైన అవగాహనను అందించడమే గాక, సంగీత ప్రదర్శనలో గాత్ర సంస్కృతిపై వారి అవగాహనను పెంచింది.

“

ఇరాన్‌పై పోరు త్వరలోనే ముగుస్తుంది. దాడి చేయడానికి అక్కడ ఇంకేమీ మిగల్లేదు. నేను అనుకున్నప్పుడు యుద్ధం ఆగుతుంది. హార్ముజ్‌లో బాంబులు పెట్టాలని ఇరాన్ ప్రయత్నించింది. మేము 16 మైన్ బోట్ల, నౌకలను ధ్వంసం చేసి ఇరాన్ ప్లాన్‌ను తిప్పికొట్టాం.

- యూఎస్ అధ్యక్షుడు ట్రంప్

మహిళలు ఆర్థిక అంశాలపై పట్టు సాధించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 11 : మహిళలకు ఆర్థిక అంశాల పై పట్టు రావడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ , ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన ద్వారా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని, మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు చిన్నతరహా వ్యాపారాలు ప్రారంభించి స్వయం సమృద్ధిని సాధించవచ్చని తెలిపారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, రుణ సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని ఆర్థికంగా బలపర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఆర్థిక స్వతంత్రం సాధించాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్ ఏం ఎల్ ఏ సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..మహిళకు ,పురుషులకు గతంలో చాలా వ్యత్యాసాలు ఉండేవని, ఓటు హక్కు కూడా లేదని, వీటిపై చాలామంది మహిళల పోరాటం వల్ల మహిళలకు హక్కులు కల్పించబడ్డాన్నారు. గతంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ గా ఉండి పురుషులకు మహిళల హక్కుపై అవగాహన కల్పించినట్లు గుర్తు చేశారు. మహిళలు బలహీనులు కాదు ,బలవంతులన్నారు.మహిళలు అవకాశాలను అందింపుచ్చుకోవాలన్నారు. మహిళలకు నమ్మకం, ఆత్మవిశ్వాసం ముఖ్యమన్నారు. మహిళలకు మహిళాచట్టాల పై అవగాహన కల్గి ఉండాలన్నారు.అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..మహిళల సాధికారత కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం మహిళలకు శాలువ,మెమెంటో తో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మి డి డబ్ల్యు హేమ భార్గవి,జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, షెడ్యూల్ కులాల నిర్వహణ అధికారి, విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు దొంతి నరేందర్ , కార్యదర్శి రాజ్ కుమార్ , మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రజా ప్రతినిధులు మహిళలు మహిళ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనగణన–2027పై జిల్లా అధికారులకు శిక్షణ

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 11: సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం సెన్సెస్-2027 ప్రక్రియపై తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత జిల్లా అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... "ఒక దేశం లేదా ప్రాంతంలోని ప్రజల సంఖ్య, వారి వయస్సు, లింగం, విద్య, ఆర్థిక స్థితి వంటి వివరాలను క్రమబద్ధంగా సేకరించి నమోదు చేసే అధికారిక ప్రక్రియనే జనగణన అని వివరించారు. ప్రభుత్వ ప్రణాళికలు రూపొందించడంలో, విధాన నిర్ణయాలు తీసుకోవడంలో,నిధుల కేటాయింపులో ఈ డేటా ఎంతో కీలకమని చెప్పారు.భారతదేశంలో సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహిస్తారని, అయితే 2021లో కరోనా వైరస్ కారణంగా అది నిర్వహించలేదని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం నిర్వహిస్తున్న జనగణనల్లో ఇది 8వదని పేర్కొన్నారు. సెన్సెస్-2027లో ఫేజ్-1లో గృహాల జాబితా (హౌస్ లిస్టింగ్), ఫేజ్-2లో జనాభా వివరాల సేకరణ జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియను భారత ప్రభుత్వం సిస్టమేటిక్ విధానంలో నిర్వహిస్తుందని చెప్పారు. జిల్లాలో తహసిల్దార్లు, ఎంపీడీవోలకు గృహ గణనపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ గణనలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, చార్జ్ ఆఫీసర్లు పాల్గొంటారని వివరించారు. ఈసారి జనగణన ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించబడుతుందని, మొబైల్ యాప్ ద్వారా కూడా డేటాను అప్లోడ్ చేసే విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. మే నెలలో గృహ గణన ప్రారంభమవుతుందని, తహసిల్దార్లు ఎంపీడీవోలు మూడు రోజుల శిక్షణను పూర్తిగా నేర్చుకుని నియమావళి ప్రకారం ప్రక్రియను అమలు చేయాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సెన్సెస్-2027ను విజయవంతంగా పూర్తి చేసి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అలాగే 2025లో సర్టిఫికెట్ల మంజూరులో ఒకటికి రెండుసార్లు పరిశీలించి మాత్రమే మంజూరు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, డిఆర్డీఓ జయదేవ్ ఆర్య, సిపిఓ దశరథ్, డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అసిస్టెంట్ సెన్సెస్ అధికారి రమాదేవి, ఉష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 11: విద్యార్థులు చిన్నతనం నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని దానిని సాధించడానికి కృషి చేయాలని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి సూచించారు. గట్ల మల్యాల ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ప్రాథమిక దశ కీలకమైనదన్నారు. ఈ దశలో విద్యార్థులు చదువులు, ఆటపాటల పట్ల శ్రద్ధ వహిస్తూ సన్మార్గంలో పయనించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, గురువులకు, గ్రామానికి మంచి పేరు తెచ్చేలా చదువుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవోగా సాత్విక్, డిప్యూటీ ఈవో గా శ్రీజ, ఎంఈఓ గా అమూల్య, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలిగా ఆరాధ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా అనిల్, ఉపాధ్యాయులుగా సారిక, పావని ,అకాంక్ష, సింధు, హిందూ, అవంతిక, అక్షయ, అరణ్య శాన్విప్రియ, శాన్విక, ధరణి, వెన్నెల మీనాక్షి ,శైలజ, సాన్వి, భవ్య శ్రీ, మనస్విని ప్రణీత, అఖిల్ రామ్, రామ్ చరణ్, రుక్విత్, నిరంజన్, హర్షవర్ధన్, అజయ్ కుమార్, శశి ప్రణయ్, విష్ణువర్ధన్, మోనిశ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మెరుగు వెంకట్, గడీల శ్రీకాంత్, అన్నపూర్ణ, లావణ్య ,వనజ, వైష్ణవి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇఫ్తార్' విందులో పాల్గొన్న 'వంటేరు'

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 11: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో గల మజీద్ లో బుధవారం నాడు జరిగిన రాబోయే రంజాన్ పండుగ ఇఫ్తార్ విందులో గజ్వేల్ బిఆర్ఎస్ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ నాయకులు గంగిశెట్టి రవీందర్, కళ్యాణ్ కార్, నర్సింగ్ రావు, మన్నే వెంకటేష్, బొగ్గుల సురేష్, వార్డ్ కౌన్సిలర్ మామిడి శ్రీధర, మాజీ కౌన్సిలర్ కనకయ్య బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 11: స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలు బుధవారం దుబ్బాక మండల పరిధిలోని గోసాన్ పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలలో బాగంగా పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులై సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు . ప్రధానోపాధ్యాయులు గా కే.లిఖిత, డి ఇ ఓ గా పి.రేశ్వంత్ , ఎం ఈ ఓ గా ఎం డి మాహిర్ లు వ్యవహరించారు. ఇట్టి కార్యక్రమంలో ఎం ఈ ఓ ప్రభుదాస్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నర్సింలు, పంచాయతీ సెక్రటరీ రేవతి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆకుల లక్ష్మణ్ ,ఉపాధ్యాయులు వెకటేశం , బద్రినాథ్ , మాధవి మేడం , సి ఆర్ పి లు పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

- ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి11: కాంగ్రెస్ పార్టీ దళితులకు పెద్దపీట వేసి వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుందని సిద్దిపేట కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 12 గురువారం రోజున కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ గా ఖమ్మంపల్లి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్ లోని గాంధీభవన్లో జరుగుతుందని ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నుండి అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 11: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సీఎస్సీ (CSC) హెల్త్ టెస్టులను రద్దు చేయాలని, వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కార్మిక కర్షక భవనంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోతిరెడ్డి రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును బలహీనపర్చే విధంగా చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం వల్ల మధ్యవర్తులు లాభపడుతున్నారని అన్నారు.అలాగే సి ఎస్ సి హెల్త్ టెస్టుల పేరుతో భారీగా నిధుల దుర్వినియోగం జరుగుతోందని ఆరోపిస్తూ వాటిని వెంటనే రద్దు చేసి కార్మికుల ఖాతాల్లోకి నేరుగా నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.10,000 పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను వెంటనే లబ్ధిదారులకు అందించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 13న కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, ఎల్లయ్య, స్వామి, మురళి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కవితకు సిద్దిపేట జాగృతి నాయకుల సంఘీభావం

- భూదాన్ భూముల బాధితులకు న్యాయం చేయాలి
- జాగృతి నాయకుల డిమాండ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 11: ఖమ్మం శివారు ప్రాంతమైన వెలుగుమట్లలో భూదాన్ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న వందలాది పేదల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేయడం అన్యాయమని తెలంగాణ జాగృతి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో పేద కుటుంబాలు గూడు, బట్టలేకుండా రోడ్డున పడిపోయాయని తెలిపారు.భూదాన్ భూముల బాధితుల పక్షాన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదారాబాద్ జాగృతి కార్యాలయంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. బాధితులకు నీలమట్టం చేసిన జాగలనే తిరిగి పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నిరవధిక నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతూ సిద్దిపేట నుంచి జాగృతి జిల్లా నాయకులు ఖమ్మం వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సిద్దిపేట ప్రాంతం తరఫున ఈ దీక్షకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట నుంచి వెళ్లిన జాగృతి నాయకులు, మాజీ ఎంపీటీసీ సిద్దర బోయిన శ్రీనివాస్, వరికోలు శ్రీనివాస్, గౌస్ మియా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. జే. వివేక్ వర్ధన్.

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చి 11: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. జే. వివేక్ వర్ధన్ అన్నారు. బుధవారం హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. జే. వివేక్ వర్ధన్ హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శనివారం నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా పాజిటివ్ దృక్పథంతో ఎదుర్కోవాలని సూచించారు. పరీక్ష హాల్లో ప్రశ్నాపత్రాన్ని జాగ్రత్తగా చదివి సమాధానాలను స్పష్టంగా, శ్రద్ధగా యాలని అన్నారు. రాబోయే నెల రోజులు కష్టపడి, ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. మధు మోహన్ మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థుల జీవితంలో ఎంతో కీలకమని తెలిపారు.ఇది విద్యార్థులు రాసే మొదటి బోర్డు పరీక్ష కావడంతో క్లిష్టమైన విషయాలపై ప్రత్యేక దృష్టి సారించి చదవాలని, పాఠశాలకు 100 శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, పంతంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అభివృద్ధిని అడ్డుకుంటే సమాజ అభివృద్ధిని అడ్డుకున్నట్లే

- ఉమ్మడి జిల్లా రిటైర్ జడ్జి రజని

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 11: గజ్వేల్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోల అభిరామ్ గార్డెన్స్ లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు మాజీ జడ్జి రజని, ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త సజయ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ జడ్జి రజని మాట్లాడుతూ మహిళా అభివృద్ధిని అడ్డుకుంటే సమాజ అభివృద్ధి ని అడ్డుకున్నట్లే అన్నారు. మహిళల ఆలోచన ధోరణి మారాలని, మహిళలు సహనశీలులు అని ముద్ర వేసి వారికి అన్యాయం జరిగిన కూడా ఎదురు తిరిగే అవకాశం లేకుండా చేస్తున్నారని అన్నారు. నిర్ణయాధికారం మహిళలకే ఉండాలి అని నొక్కి చెప్పారు. విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు గా ఎన్నిక కావడం గొప్ప విషయం అన్నారు.ఒక గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే మహత్తర అవకాశం మీకు లభించింది అన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎన్నో రుగ్మతలు ఉన్నాయని వాటిని అరికట్టే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో వ్యవసాయం,విద్య,వైద్యం పై ప్రత్యక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన, వైస్ చైర్మన్ కళ్యాణ్ కార్ పద్మాబాయి, ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ అంబాదాస్, చౌదరి వార్డు కౌన్సిలర్ బొగ్గుల స్వప్న మరియు మున్సిపల్ కౌన్సిలర్లు మరియు వివిధ గ్రామాల సర్పంచ్లు పాల్గొన్నారు. వీరికి ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఇరాన్ దాడుల నేపథ్యంలో సౌదీకి మద్దతుగా ఉంటాం. గతేడాది కుదుర్చుకొన్న రక్షణ ఒప్పందం ప్రకారం రియాద్‌కు ఎలాంటి పరిస్థితుల్లోనైనా, ఏ క్షణమైనా అవసరమైన సాయం అందిస్తాం. యుద్ధం ముగిసేలా దౌత్యపరంగా ప్రయత్నం చేస్తాం. పెరుగుతున్న చమురు ధరల దృష్ట్యా పాక్‌కు ఇంధన సరఫరా చేసేందుకు సౌదీ అంగీకరించింది.

- పాక్ ప్రధాని ప్రతినిధి ముషారఫ్ జైదీ

ప్రాంతీయం

మల్లన్న ఆలయంలో వేలం పాట
ఆదాయం రూ. 26 లక్షల 71 వేలు

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 11: మురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సెల్ ఫోన్ భద్రపరుచుకొను లైసెన్స్ హక్కు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాట ఆదాయం రూ. 26 లక్షల 71 వేలు వచ్చింది. బుధవారం కొమురవెల్లిలోని దేవస్థాన కార్యాలయంలో ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంట నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం పాటలో మొత్తం 7 మంది సభ్యులు పాల్గొన్నారు. కొమురవెల్లి ఆలయంలో సెల్ ఫోన్ భద్రపరచు కొను హక్కుకు ఒక సంవత్సరం కాలపరిమితితో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా కొమురవెల్లి గ్రామానికి చెందిన ముత్యం విజయకుమార్ రూ.26,71,000 లకు హెచ్చుపాట పాడి లైసెన్స్ హక్కును పొందారు. ఇతర టెండర్స్ లలో వ్యాపార షాపులకు ఒక్కక్క షెడ్యూలు వచ్చినందున కాన్సల్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు బుద్ది శ్రీనివాస్, రావుల సుదర్శన్, సూపరింటెంట్ నీల చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాయక సాగర్ కాలువలో
తుంగ, పూడిక తొలగించాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట మార్చి 11: రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ ప్రధాన కాలువలో తుంగ, పూడిక అధికంగా పేరుకుపోవడంతో 310 క్యూసెక్కులు వెళ్లాల్సిన నీరు ప్రస్తుతం కేవలం 115 క్యూసెక్కులు మాత్రమే వెళ్లుతోంది. దీంతో రైతులకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయం హరీష్ రావు దృష్టికి రావడంతో ఆయన హైదరాబాద్ నుండి ఇరిగేషన్ ఎస్.ఈ సుధాకిరణ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లో భాగంగా నిర్మించిన రంగనాయక సాగర్ నుంచి నంగునూర్ మండలానికి వెళ్లే కుడి కాలువలో గత కొన్ని రోజులుగా తుంగ, పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం మందగించిందని తెలిపారు.దీని వల్ల చెరువులకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మిట్టపల్లి వద్ద కాలువ లోతుగా ఉండటంతో సాధారణ ఎక్స్కవేటర్ లేదా జేసీబీలతో పని చేయడం సాధ్యం కాదని, వెంటనే లాంగ్ బూమ్ మిషన్ ఏర్పాటు చేసి కాలువలోని తుంగ, పూడికను తొలగించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు సూచించారు.

సిద్ధిపేటకు రూ.3.70 కోట్లు మంజూరు

- సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 11: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. సిద్ధిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిద్ధిపేట నియోజకవర్గానికి రూ.3 కోట్ల 70 లక్షల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని, సర్పంచ్‌లకు నిధులు ఇవ్వక అప్పుల పాలయ్యేలా చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సిద్ధిపేటకు నిధులు రావడానికి కృషి చేసిన ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, పూజల గోపికృష్ణ, రాజబహదూర్ రెడ్డి, డీసీసీ మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఎర్ర మహేందర్, చెంది శ్రీనివాస్ ముదిరాజ్, జనార్ధన్ రెడ్డి, ప్రవీణ్, రజని తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి11: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 6వ రోజు బుధవారం నాడు తడిచెత్త, చెత్త పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్, వైస్ చైర్ పర్సన్ పద్మబాయి నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా చేసి పారిశుద్ధ కార్మికులకు అందించాలని సూచించారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ స్వచ్ఛ మున్సిపల్ గా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగడం జరుగుతుందని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి, స్వప్న సురేష్, గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, మామిడి శ్రీధర్, కామిని మురళి, రొట్టెల శ్రీనివాస్, వార్డు సభ్యులు మామిడి శంకర్, హనుమంత్ రెడ్డి తాళ్ల నాగరాజు,శంకరప్ప,ఎర్రవాడ బాలకృష్ణ,శంభు గారి ప్రశాంత్, శివ ,వేణు, గుంటుకు నరసింహులు, వార్డుల వారిగా సీనియర్ నాయకులు, మునగారి రాజు, గాజుల శ్రీనివాస్ వివిధ పార్టీల నాయకులు,మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. నాచగిరి లక్ష్మీ నరసింహ కళ్యాణం

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 11: అశేష భక్త జనుల మధ్య వర్గల్ మండలం నాచగిరి శ్రీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా మంగళవారం అర్ధరాత్రి దేవస్థాన పురోహితులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పల్లెల రవీందర్ మరియు కార్యనిర్వహణాధికారి బెల్లంకొండ రంగాచారి స్వామివారికి అమ్మవారికి తలంబ్రాలు, సమర్పించారు. కార్యక్రమంలో దేవనాథ జీయర్ స్వామి, పాలకమండలి సభ్యులు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, నాయకం శ్రీనివాస్, కొత్తపల్లి శ్రీనివాస్, ఉషశ్రీ రాజశేఖర్ శర్మ, జగ్గన్న గారి సురేందర్ రెడ్డి, కర్రె పద్మ వెంకటేష్, జగ్గయ్య గారి శేఖర్ , భక్తులు పాల్గొన్నారు.

బిస్వాల్ కమిటీ సీఎంకు గుర్తు లేదా?

- ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలి
- టీజీపీఎస్సీ ని కలిసిన ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి
- బుర్ర వెంకటేశంకు వినతి పత్రం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీజీపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ బుర్ర వెంకటేష్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇప్పుడు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బిస్వాల్ కమిటీ అని తరచూ ప్రస్తావించేవాడని , వచ్చిన తర్వాత సీఎంకు బిస్వాల్ కమిటీ గుర్తుకు రావడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామకం చేపట్టిన ఉద్యోగులపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్టంలో గ్రూప్ 1,2,3,4 ఉద్యోగ ప్రకటనలతో పాటు సీడీపీవో, విద్యుత్ శాఖలో ఏఈ, ఏ ఈఈ, వ్యవసాయ శాఖలో ఏవో, ఏఈవో, రవాణా శాఖలో ఏ ఎమ్ వి ఐ, పారెస్ట్ డిపార్ట్మెంట్ లో ఎఫ్ బి ఓ, ఎఫ్ ఎస్ ఓ, ఎఫ్ ఆర్ వో , లతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పక్షాన తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వచ్చే బడ్జెట్ సెషన్ లో నిరుద్యోగుల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తామన్నారు. దీనికి టీజీపీఎస్సీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు అంజిరెడ్డి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

ప్రతిపక్షం, కొమురవెల్లి, మార్చి 11: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వరంగల్ జిల్లా 303 సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగ గోపాల్ రెడ్డి సూచించారు. బుధవారం కొమురవెల్లిలో శ్రీ మల్లికార్జునస్వామిని దర్శించుకున్న అనంతరం స్థానికులకు, భక్తులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం శబ్ద, వాయు, జల కాలుష్యాలను నియంత్రించడానికి ప్లాస్టిక్ సంచుల బదులు బట్టసంచులను, పొగలు శబ్దాలు కలుగకుండా పొగ బండ్ల వినియోగాన్ని తగ్గించి సైకిలుపై ప్రయాణించాలని అన్నారు. అనంతరం ఫ్లకార్డ్ లను ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిద ప్రాంతాల యాత్రికులు, స్థానిక విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శ ప్రాయులుగా ఎదగాలి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 11: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట వార్డు లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల రవీందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు తమ జీవితంలో ఇది ఒక ముఖ్యమైన మలుపు అని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని కష్టపడి చదివి సమాజానికి ఆదర్శప్రాయులుగా ఎదగాలని సూచించారు. పాఠశాలలో గడిపిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ విద్యార్థులు భావోద్వేగంతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠశాలలో అందించిన విద్య, క్రమశిక్షణ, విలువలు జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఫోక్ సింగర్ స్వామి గుజారే గుజారే సాంగ్ ఫేమ్ మా పాఠశాలలో ఫోక్ సాంగ్స్ పాడుతూ విద్యార్థులందరి లో ఉత్సాహాన్ని నింపినాడు. వేద సేవ ఫౌండేషన్ ఫౌండర్ సుతారి సందీప్ పాల్గొని పాఠశాల పదవ తరగతి విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్లు, పెన్నులను, పెన్సిళ్లను డొనేట్ చేయడం జరిగింది.అనంతరం పదవ తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు సత్కరించి వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మమత , ధర్మాజీపేట కౌన్సిలర్లు గోవిందు గారి శోభా విష్ణువర్ధన్ రెడ్డి, మెరుపుల సాయికుమార్ గౌడ్, వనం రమేష్ , పాఠశాల ఉపాధ్యాయులు మహమ్మద్ సాదత్ అలీ, పల్లె శ్రీనివాస్ గౌడ్ , కె. వెంకట కృష్ణమాచారి, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, కె .శ్రీకాంత్, పి. బాలకృష్ణ, ఆర్. పద్మావతి , బి నరేష్ యం. అశోక్, ఎస్. దినేష్, సిహెచ్. చంద్రశేఖర్ , బి. రాజేందర్, ఏ.రేణుక, సి ఆర్ పి టి.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పెద్దశివనూర్ వార్డు సభ్యులు

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 11: చేగుంట మండలం పెద్ద శివనూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ లో చేరిన వారిలో వార్డు సభ్యులు బండారి రాములు, వడియారం దుర్గవ్వ, అన్నం భవాని, ఆంజనేయులు అలాగే బీఆర్ఎస్ నాయకులు ఎర్ర మల్లేష్ సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవిచూసిన వడియారం ఎల్లం కాంగ్రెస్ లో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాసరెడ్డి వారికి కానువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు మహమ్మద్ రఫీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మహిళ హత్య.. 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

- అనుమానంతో హత్య చేసిన ప్రియుడు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 11: మెదక్ జిల్లా ఏడుపాయల శివారులో జరిగిన మహిళ హత్య కేసు ను పాపన్నపేట పోలీసులు 24 గంటల్లో చేదించారు వేరే వ్యక్తితో తిరుగుతుందన్న అనుమానంతో ప్రియుడు కర్రతో కొట్టి హత్య చేసినట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు. బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ హత్యకు సంబంధించిన వివరాలను తెలిపారు పాపన్నపేట మండలం కొండపాక గ్రామానికి చెందిన బ్యాగరి సులోచన (35) భర్త మరణించడంతో ఉపాధి కోసం కూలీ పనులు చేసేది. ఈ క్రమంలో మేస్త్రీ పని చేసే రామాయంపేటకు చెందిన రాజుతో పరిచయం ఏర్పడి, ఇద్దరి మధ్య కొంతకాలంగా అక్రమ సంబంధం కొనసాగుతుంది. సులోచనకు రాజు కొన్ని బంగారు ఆభరణాలు కూడా ఇచ్చినట్లు తెలిపారు. అయితే సులోచన వేరే వ్యక్తితో తిరుగుతుందన్న అనుమానం రాజుకు కలిగింది. సోమవారం రామాయంపేటకు చెందిన బాలితో కలిసి రాజు సులోచనను మోటార్ బైక్పై ఎక్కించుకుని ఏడుపాయల శివారులోని చెరువు గుట్టకు తీసుకెళ్లాడు.అక్కడ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ముందే ప్రణాళికతో ఉన్న రాజు కర్రతో గట్టిగా కొట్టడంతో సులోచన కిందపడిపోయి మృతి చెందింది. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని ఇద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏడుపాయల శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానిక ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ విషయం రూరల్ సీఐ జార్జ్లు తెలియజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టగా మృతురాలు కొండపాకకు చెందిన సులోచనగా గుర్తించారు. అనంతరం దర్యాప్తులో రామాయంపేటకు చెందిన తాపీ మేస్త్రీ రాజు హత్య చేసినట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. రాజుకు సహకరించిన బాలిని కూడా అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.ఏడుపాయల శివారులో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించడం పై డీఎస్పీ అభినందించారు. గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసి మృతురాలిని గుర్తించి హత్య మిస్టరీని ఛేదించిన రూరల్ సీఐ జార్జ్, సీసీఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్లను అభినందించారు. ఈ సమావేశంలో సీఐ జార్జ్, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు 20 నెలల్లో రూ.3.20 లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. మేము కరోనా పరిస్థితుల్లోనూ తక్కువగానే అప్పులు చేశాం. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. రాష్ట్ర ఖజానాలో మినిమమ్ బ్యాలెన్స్ కూడా లేదు. చంద్రబాబు బిల్డప్ మాత్రమే ఇస్తున్నారు. అసెంబ్లీలోనూ అప్పులపై తప్పుడు లెక్కలు చెప్పారు. ఆ సమావేశాల వల్ల ఒరిగిందేమీ లేదు.

- వైసీపీ అధినేత జగన్

ప్రాంతీయం

సాగునీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో

- వేసిన పంటలు ఎండిపోతున్నాయి
- నీళ్లు విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం
- రాయపోల్ మండలం వీరనగర్ స్టేజి వద్ద రోడ్డుపై బైఠాయించి మూడు గ్రామాల రైతులు ఆందోళన

ప్రతిపక్షం, రాయపోల్, మార్చి 11: కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి రామాయంపేట కెనాల్ ద్వారా వస్తున్న నీటిని తమ గ్రామాలకు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వీరనగర్ స్టేజి వద్ద రైతులు రోడ్డుపై బైఠాయించి రెండు గంటలపాటు ధర్నా రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. చెరువులు నింపుకోవడానికి కాల్వ ఉన్నప్పటికీ నీళ్లు విడుదల చేయాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లింగారెడ్డి పల్లి గ్రామ రైతులు మాట్లాడుతూ చెరువు కింద వేసిన పంటలు ఎండిపోయే దశకు వచ్చాయని రామయంపేట్ కెనాల్ ద్వారా చెరువు నింపి పంటలను కాపాడాలని వాపోయారు. లింగారెడ్డిపల్లి. అంకిరెడ్డిపల్లి. రాంసాగర్. పెద్ద ఆరేపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమకు పంట పొలాలకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. తలాపున కెనాల్ ఉన్నప్పటికీ తమ చెరువులోకి నీళ్లు ఎందుకు విడుదల చేయడం లేదని ఆయా గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి వరి నాట్లు వేసినప్పటికీ చెరువుల్లో నీరు ఇంకిపోవడంతో ఆయకట్టు కింద ఉన్న వరి పంట పొలాలు ఎండిపోయే దశకు వస్తున్నాయని, దీంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని వెంటనే రామాయంపేట కెనాల్ ద్వారా మూడు గ్రామాల చెరువులకు నీళ్లు విడుదల చేయాలని లేనిపక్షంలో తాము రోడ్డుపై ఆందోళన విరమించి ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీంతో రైతుల ఆందోళన తెలుసుకున్న రాయపోలు ఎస్సై మానస అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. అయినప్పటికీ వారు వినిపించుకోకుండా ఆందోళన చేశారు. ఎస్సై మానస రైతులతో మాట్లాడుతూ సంబంధిత ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన నిర్మించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల రైతులు. లింగారెడ్డి పల్లి సర్పంచ్ స్వామి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ స్వామి, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

- స్పెషల్ ఆఫీసర్ సహా ఇరువురికి షోకాజ్ నోటీసులు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 11 : నవీపేట మండలం మోకన్ పల్లిలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. నిర్వహణపరమైన లోపాలను గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంచార్జి స్పెషల్ ఆఫీసర్ కవితతో పాటు, బోధనా విధులలో కొనసాగుతున్న రాజశ్రీకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. బాలికల విద్యాలయాల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని, విద్యార్థినుల భద్రతకు, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులు ఏ ఒక్కరిని కూడా లోనికి అనుమతించకూడదని అన్నారు. అనంతరం 10వ తరగతి క్లాస్ రూంను కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పాఠాలు బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ వారి బోధనా సామర్థ్యాన్ని పరిశీలించారు. చక్కగా చదువుకుని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. విద్యార్థినుల కోసం పాఠశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను కలెక్టర్ పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ గురించి బాలికలకు వైద్యులు చక్కగా అవగాహన కల్పించడం పట్ల వారిని కలెక్టర్ అభినందించారు. కాగా, కేజీబీవీ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఇద్దరి పై చర్యలు

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నవీపేట మండలం మోకన్ పల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇంచార్జి స్పెషల్ ఆఫీసర్ కవితతో పాటు, గెస్ట్ ఫ్యాకల్టీ రాజశ్రీకి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, తదుపరి ఉత్తర్వులు వెలువరించేంత వరకు వీరిరువురికి వేతనాలను నిలిపివేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.

రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆధునీకరణకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 11 : నిజామాబాద్ నగర నడిబొడ్డున గల రాజీవ్ గాంధీ ఆడిటోరియంను ఆధునీకరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె రాజీవ్ గాంధీ ఆడిటోరియం, న్యూ అంబేద్కర్ భవన్ లను సందర్శించారు. ఆడిటోరియం హాల్, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. సంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించేందుకు ఆడిటోరియం అనువైనదిగా ఉన్నందున, దీనిని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించి ఆధునీకరించాలని కలెక్టర్ సూచించారు. ఎయిర్ కండిషన్ సదుపాయం సైతం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆధునీకరణ పనులకు అయ్యే అంచనా వ్యయం, అందుబాటులో ఉన్న నిధులు తదితర సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. ఆడిటోరియంను ఆనుకుని పక్కనే ఉన్న న్యూ అంబేద్కర్ భవన్ ను కూడా మరమ్మతులు చేయించి, సరైన విధంగా నిర్వహణ జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు.

శిక్షణ కార్యక్రమం కోసం వేదికల పరిశీలన...

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఈ నెల 12న ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పలు వేదికలను పరిశీలించారు. న్యూ అంబేద్కర్ భవన్, రాజీవ్ గాంధీ ఆడిటోరియంతో పాటు అమృతా గార్డెన్ లను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లు, చైర్ పర్సన్ లు, కౌన్సిలర్లు, గ్రామ పంచాయతీల సర్పంచ్ లకు ఉదయం నుండి సాయంత్రం వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగనున్న దృష్ట్యా అనువైన వేదికలను ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

జన గణన విధులను పక్కాగా నిర్వహించాలి

- శిక్షణ తరగతుల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 11 : జన గణన విధులను పక్కాగా నిర్వహించాలని, అప్పుడే ఆయా వర్గాల ప్రజలకు భవిష్యత్తులో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం ఒక అవగాహనకు వచ్చి కార్యాచరణను అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సెన్సెస్ - 2027 ను పురస్కరించుకుని జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగస్వాములు అయ్యే తహసిల్దార్లకు, సంబంధిత శాఖల అధికారులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ నెల 13వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుండగా, హైదరాబాద్ నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పిస్తున్నారు. జనాభా గణన కోసం ఎలా సన్నద్ధం కావాలి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, 2011 లో చివరిసారి జనాభా గణన జరిగిందని గుర్తు చేశారు. వాస్తవానికి 2021 లో ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా, కరోనా తీవ్రత వల్ల నిర్వహించలేదని అన్నారు. ప్రస్తుతం సాంకేతికతను వినియోగిస్తూ, డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ జరిపేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తొలి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల కట్టడాలు, కుటుంబ వివరాలను సేకరించడం జరుగుతుందని, రెండవ విడతలో వ్యక్తిగత వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. దేశంలోనే తొలిసారి పూర్తిగా డిజిటల్ విధానం ద్వారా జన గణన జరపాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే గతేడాది నల్గొండ జిల్లా తిప్పర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలాల్లో ప్రయోగాత్మకంగా కుటుంబ, ఇళ్ళ వివరాల సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ గుర్తు చేశారు. జన గణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై వాస్తవ వివరాలు వెల్లడించాలని సూచించారు. ఏ ఒక్కరి వివరాలు సైతం ఎక్కడ కూడా బయటికి వెల్లడి కావని, నేరుగా సర్వర్ లో నిక్షిప్తం అయ్యేలా సాంకేతికతను వినియోగిస్తున్నారని అన్నారు. ఈసారి సెల్ఫ్ డిక్లరేషన్ ఎంతో ముఖ్యమని, అధికారులు, ఎన్యుమరేటర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. చార్జ్ ఆఫీసర్లు ప్రతిరోజూ జన గణన ప్రక్రియను సమీక్షించాలని, తాము కూడా రోజువారీగా పర్యవేక్షణ జరుపుతామని అన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్దేశిత గడువు లోపు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను మెరుగైన రీతిలో పూర్తి చేసేలా సన్నద్ధం చేయాలన్నారు. ప్రణాళికల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జన గణన ప్రక్రియను నిబద్ధత, అంకితభావంతో నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై కలెక్టర్‌తో సమీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 11 : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్ధిపై, ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ల పై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరతగతిన పూర్తి చేసేలా ప్రణాళికలు చేపట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ను కోరారు. అర్బన్ ఎమ్మెల్యే బుధవారం జిల్లా కలెక్టర్ తో ప్రత్యేకంగా సమీక్షించారు. సమీక్ష అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే నిర్మించి అర్హులైన నిరుపేదలకు అందించే విధంగా ప్రణాళికలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి రావలసిన యూజీడి పనుల నిధుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కలెక్టర్ కు సూచించారు. బోధన్ బస్టాండ్ సమీపంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మరమ్మతులను పూర్తిచేసి అర్హులైన వారికి కేటాయించాలన్నారు. గత 12 రోజుల క్రితం 12 శాఖల ముఖ్య అధికారులతో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో తాను రివ్యూ చేపట్టడం జరిగిందని ఆ రివ్యూ కు సంబంధించిన పురోగతిని తెలుసుకునేందుకు తిరిగి జిల్లా కలెక్టర్ తో పూర్తి వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. ఏది ఏమైనా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్దే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 11: నగరంలోని అర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సొసైటీ సోల్జర్స్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థి విజయ స్ఫూర్తి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని, ప్రణాళిక బద్ధంగా చదువుకొని కొనసాగించాలని, దేశభక్తి సామాజిక స్పృహతో ముందుకు వెళ్లాలని ఆయన తెలిపారు. సోల్జర్స్ సొసైటీ యూత్ అధ్యక్షుడు మేదర్ శేఖర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు కంగారు పడకుండా తమ లక్ష్యం వైపు ముందుకు సాగాలని తమ లక్ష్యంలో ఏవైనా అడ్డంకులు వస్తే స్వామి వివేకానంద ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులను మహనీయులను స్ఫూర్తి దాయకంగా తీసుకొని ముందుకు సాగుతూ లక్ష్యాలను ఛేదించాలని వారి యొక్క ఆదర్శాలను మన జీవితంలో ఇమ్మడింపజేసుకొని మన జీవితాలను మెరుగుపరచుకొని వాటితో పాటు సమాజ సేవా కార్యక్రమంలో కూడా ముందుండాలని వారు తెలిపారు. ఈ సందర్భంగా భాగంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల కిట్టును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ హెడ్మాస్టర్ పిల్లలు శ్రీనివాస్, ఉపాధ్యాయులు యూత్ సభ్యులు కుచ్చుల సంజు చందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 11 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆపద మిత్ర వాలంటీర్లకు బుధవారం న్యాక్ భవనంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు కొనసాగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఆపద మిత్ర వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైర్, ఇరిగేషన్, ఫిషరీస్, వైద్యారోగ్య శాఖల అధికారులు హాజరు అయి ప్రకృతి విపత్తుల సమయం లో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న వాలంటీర్లకు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్, ఐ.డీ కార్డులు, హ్యాండ్ బుక్ లు అందజేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ విపత్తుల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్ రావు, అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, ఫిషరీస్ ఏ.డీ ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నేడు శిక్షణా కార్యక్రమం

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఉదయం 10 గంటలకు అమృత గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఆయా గ్రామాల సర్పంచులకు, భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపల్ చైర్ పర్సన్ లకు, వైస్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 11: వాటర్ ట్యాంక్ ఎక్కి వాటర్ ట్యాంక్ శుభ్రతను పరిశీలించి వర్కర్లను అభినందించి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సన్మానించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా లోని సదాశివ నగర్ మండలంలో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాటర్ ట్యాంక్ ఎక్కి తనిఖీ చేసి పరిశుభ్రత పనులు నిర్వహిస్తున్న కార్మికులతో మాట్లాడారు. పరిశుభ్రత పనులను సమర్థవంతంగా నిర్వహించిన కార్మికులు ఎల్లగారి భుచ్చయ్య, పోట్నగారి ప్రవీణ్ లను జిల్లా కలెక్టర్ అభినందించి వారిని సన్మానించారు. గ్రామాలలో పరిశుభ్రత, తాగునీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకుల శుభ్రతను తరచూ నిర్వహించాలని, పంచాయతీ సిబ్బంది , కార్మికులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో చందర్, ప్రత్యేక అధికారి సతీష్, డీఎల్‌పీవో శ్రీనివాస్, పంచాయతీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు , సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి పార్టీ ఫిరాయింపు కేసులో స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు. కాంగ్రెస్ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసిన వారికే క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజల తీర్పును అవమానించడమే. అధికార పార్టీ కోసం రాజ్యాంగ వ్యవస్థలను వాడుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ప్రజలు తగిన బుద్ధి చెప్తారు.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రాంతీయం

పటాన్‌చెరులో రెండో రోజు కొనసాగిన మహిళల క్రీడోత్సవాలు

- నేడు జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గస్థాయి మహిళా దినోత్సవ వేడుకలు.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని.. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా ఏర్పాటు చేసిన మహిళా క్రీడోత్సవాలు రెండో రోజు ఘనంగా కొనసాగాయి. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తో పాటు తన సతీమణి గూడెం యాదమ్మ తో కలిసి స్వయంగా వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పటాన్ చెరు పట్టణం వేదికగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిత్యం కుటుంబ నిర్వహణ, ఉద్యోగం వంటి బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా ఉండే మహిళల కోసం క్రీడోత్సవాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం పటాన్ చెరు లోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గస్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, డివిజన్ల పరిధిలోని మహిళలందరూ వేడుకల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. క్రీడోత్సవాల్లో విజేతలుగా నిలిచిన వారందరికీ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజయ్ కుమార్, విజయ్ భాస్కర్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, హారిక విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

బాలమేళాలో సారపాక పాఠశాల విద్యార్థి ప్రతిభ

- జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి

ప్రతిపక్షం, సారపాక, మార్చి 11: తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వినూత్నంగా నిర్వహించిన బాలమేళా కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి మంచి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తరగతి పాఠ్యాంశాలు,గ్రంథాలయం అనే రెండు అంశాలలో పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,సారపాకకు చెందిన బి. మోక్షిత్ విద్యార్థి స్టోరీ టెల్లింగ్ విభాగంలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో తృతీయ బహుమతిని సాధించాడు.జిల్లా స్థాయిలో బహుమతి అందుకున్న సందర్భంగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు దూద బహుమతి గెలుచుకున్న విద్యార్థిని,పాఠశాల సిబ్బందిని అభినందించారు.అలాగే, విద్యార్థికి నిరంతరం మార్గనిర్దేశనం చేస్తూ ఆత్మవిశ్వాసం కల్పించి పాఠశాల ప్రతిభను జిల్లా స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిన బి. అనిత టీచర్ ను విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల బృందం ప్రత్యేకంగా అభినందించారు.ఈ విజయంతో పాఠశాల ప్రతిష్ట మరింత పెరిగిందని,విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలో ప్రతిభ చూపాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

గుండాల–ఆళ్లపల్లి మండలాల్లో విద్యుత్ సదుపాయాల విస్తరణ

- వేలాది వ్యవసాయ కనెక్షన్లు మంజూరు

ప్రతిపక్షం, గుండాల, మార్చి 11: ఆళ్లపల్లి,గుండాల మండలాల్లో రైతులకు విద్యుత్ సరఫరాను మెరుగుపరచడానికి విద్యుత్ శాఖ పలు చర్యలు చేపట్టినట్లు సబ్ ఇంజనీర్ ఏ.ఈ. జగదీష్ బాబు, సబ్ ఇంజనీర్ నజీర్ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. 2024 నుండి 2025 వరకు ఆళ్లపల్లి,గుండాల మండలాల్లో 2100కు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయగా, 2025 నుండి 2026 వరకు సుమారు 1600 వ్యవసాయ సర్వీసులు మంజూరు చేయడం జరిగిందనీ లో ఓల్టేజ్ సమస్యను నివారించేందుకు గుండాల మండలంలోని గుండాల సబ్ స్టేషన్‌లో ఇప్పటికే ఉన్న ఒక 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా రూ.90 లక్షల వ్యయంతో మరొక 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని. అలాగే మామకన్ను సబ్ స్టేషన్‌లో ఉన్న రెండు 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో రూ.1.80 కోట్ల వ్యయంతో రెండు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. గుండాల సబ్ స్టేషన్‌కు సుమారు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న 132/33 KV ఇల్లందు సబ్ స్టేషన్ నుండి 33 KV విద్యుత్ సరఫరా జరుగుతోంది. దూరం ఎక్కువగా ఉండటం వల్ల లో ఓల్టేజ్ సమస్య తలెత్తుతోందని. ఈ సమస్యను తగ్గించేందుకు గుండాల సబ్ స్టేషన్‌లో రూ.70 లక్షల వ్యయంతో రెండు 5 MVA బూస్టర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, మామకన్ను సబ్ స్టేషన్‌లో రూ.35 లక్షల వ్యయంతో ఒక బూస్టర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని.అలాగే 11 KV ఫీడర్లపై లోడ్ తగ్గించేందుకు రెండు సబ్ స్టేషన్‌లలో రూ.60 లక్షల వ్యయంతో రెండు కెపాసిటర్ బ్యాంక్‌లు ఏర్పాటు చేశామని.అదేవిధంగా 11 KV లైన్లలో ప్రతి ఫీడర్‌కు మూడు చొప్పున మొత్తం రూ.25 లక్షల వ్యయంతో 600 కేవీఏఆర్ కెపాసిటర్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.ఇక 2026 సంవత్సరానికి కాచనపల్లి,సాయనపల్లి,ముత్తపురం గ్రామాల్లో కొత్తగా 33/11 KV సబ్ స్టేషన్‌లను మంజూరు చేసినట్లు తెలిపారు. వాటి పనులను ఏప్రిల్ నెలలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అదే విధంగా గుండాల మండలంలో కొత్తగా 132/33 KV సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం కూడా ప్రతిపాదనలు పంపినట్లు వారు తెలిపారు.

నిర్దేశిత లక్ష్యంతో పశ్చిమ వరంగల్ అభివృద్ధి

- రూ 1.17 కోట్ల పనులకు శంకుస్థాపన
- ప్రజల మధ్యలోనే పాలన
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 11: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిని నిర్దేశిత లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం, స్థానిక అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం 50వ డివిజన్ పరిధిలో రూ.1.17 కోట్ల నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు మరియు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ప్రజల మధ్యలోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి డివిజన్‌లో ప్రారంభించిన పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చినట్లు తెలిపారు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ఏబీసీ కేటగిరీలుగా గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు మంత్రులతో సమన్వయం చేస్తూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కీలకమైన అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు ప్రస్తుతం కాజీపేటలో ఆర్వోబీ నిర్మాణం, ఆధునిక సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, వరంగల్ నగరానికి ఎంతో అవసరమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు, అలాగే భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి వంటి కీలక పనుల అమలుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో మరింత వేగం కనిపిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు డివిజన్‌లలో కార్పొరేటర్లు మరియు స్థానిక నాయకత్వం ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారిస్తూ తమ దృష్టికి తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సహకారంతోనే బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలమని ఆయన పేర్కొన్నారు అనంతరం డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే, స్థానికంగా గుర్తించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు,డివిజన్ కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్,డివిజన్ అధ్యక్షులు అఫ్సర్, నాయకులు ప్రసాద్,రమేష్,వెంకన్న అధికారులు ఈ ఈ రవి కుమార్ డి ఈ శ్రీకాంత్,ఏ ఈ ప్రవళిక మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

మోదీ ఇల్లు కట్టిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లు కూల్చేస్తుంది

- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేమే గెలిస్తాం
- బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి
- బొల్లారంలో బిజెపిలో భారీ చేరికలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11: బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూములు ఇస్తామని మోసం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లతో ప్రజలను దగా చేస్తుందని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గడచిన కాలంలో ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్నీ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. 10 యేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా బొల్లారంలో జీహెచ్‌ఎంసీ 272 డివిజన్ పరిధిలోని వినాయక నగర్ కాలనీకి చెందిన లక్ష్మీదేవి, ఆమె కుమారుడు, తన బృందంతో కలిసి సుమారు 100 మంది కార్యకర్తలతో భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ నాయకులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు నాయకులు బీజేపీ లో చేరుతున్నారని అన్నారు. మచ్చలేని నాయకుడు మోదీని నీ చూసి మేధావులు బీజేపీ లోకి వస్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఇల్లు కట్టిస్తే రేవంత్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చుతుందన్నారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీ పార్టీకి అండగా నిలుస్తారని, దాదాపు అన్ని స్థానాల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం బీజేపీ అధ్యక్షులు ఆనంద్ కృష్ణ రెడ్డి, శ్రీకాంత్ చారి జనరల్ సెక్రెటరీ అఖిల్, అరుణ్, విష్ణు చారి మరియు కార్యకర్తలు తదితరులు తదితరులు ఉన్నారు.

కోర్టు ప్రాంగణంలో మహిళా దినోత్సవం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11 : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర అంతార్జాతీయ మహిళా దినోత్సవాన్నీ కోర్టు ప్రాంగణంలో జరుపుకోవడం జరిగింది. 2026 థీమ్ "గివ్ టూ గైన ": ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం "గివ్ టు గెయిన్" (గివ్ టూ గైన) అనే ఇతివృత్తంతో (థీమ్) నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి భవాని చంద్ర, కే జయంతి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, కృష్ణార్జున జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి, శ్రీలేఖ ఫోక్సో కోర్టు న్యాయమూర్తి, బి సౌజన్య జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, ఆర్ అనిత ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, కె. ధనలక్ష్మి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కోర్టు మహిళా సిబ్బందులు కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటికి ప్రత్యేక చర్యలు

- 8వ వార్డులో మినరల్ వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ
- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్
- వార్డు కౌన్సిలర్ బెంబడి సంజీవ రెడ్డి.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 11 : వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని అన్నారం 8వ వార్డులో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ గత కొన్ని నెలలుగా సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో వార్డు కౌన్సిలర్ బెంబడి సంజీవ రెడ్డి చర్యలతో ప్లాంట్ కు మరమ్మత్తులు చేపట్టి తిరిగి ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. బుధవారం వార్డు కౌన్సిలర్ బెంబడి సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ వార్డు కౌన్సిలర్లు, నాయకులు, ప్రజల సమక్షంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వేసవిలో పురపాలక సంఘం పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో కూడా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు తుపాకుల రాధిక, మేడిపల్లి మురళి, ఆర్ల కిషన్, గోకర్ నిర్మల గౌడ్, మద్ది సోనీ రెడ్డి, నాయకులు రుక్మారెడ్డి, జయశంకర్ గౌడ్, వెంకట్రాం రెడ్డి, తుపాకుల రాజు, హుస్సేన్, మద్ది శేఖర్ రెడ్డి, నాయకులు, యువకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధుల శిక్షణ

- అందుకు తగిన ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 11: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్, మార్చి 12న నిర్వహించనున్న మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనను మరింత ప్రజలకు చేరువ చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. అందుకు అనుగుణంగా నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి సంబంధించి శాఖల వారీగా మినిట్‌టుమినిట్ కార్యక్రమాన్ని రూపొందించి, అవసరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యాచరణను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలలో అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యం, రోడ్డు భద్రత (అరైవ్ అలైవ్ కార్యక్రమం), సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు వాటి గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు, అర్హులైన లబ్ధిదారులకు వాటిని చేరవేయడంలో ప్రజాప్రతినిధులు తీసుకోవలసిన చర్యలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలు వంటి అంశాలను వివరించాలని తెలిపారు. అలాగే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్టాలకు సంబంధించిన ముఖ్యాంశాలను ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సులభంగా అర్థం చేసుకునే విధంగా ట్రైనర్ల సహాయంతో శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారుల నుంచి రోజువారీ నివేదికలు అందించాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, గ్రామాలు మరియు పట్టణాల్లో శుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

“



సూర్యకుమార్ ఫిట్‌గా ఉన్నంత కాలం టీ20 టీమ్ కెప్టెన్‌గా కొనసాగొచ్చు. ఒకవేళ ఆయన తప్పుకొంటే కెప్టెన్‌గా సంజూ శాంసన్ సరైన వ్యక్తి. ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా అతనికి ఉన్న అనుభవం కలిసొస్తుంది. ప్రపంచకప్‌లో అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన 31 ఏళ్ల సంజూ టీమ్‌ను నడిపించగల సమర్థుడు.
- మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్

ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం

- కాల్పులు జరిపిన ఆగంతకుడు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, జమ్మూ, మార్చి 11: జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, ఎన్సీ అధినేత ఫారూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది. జమ్ములో ఓ వివాహానికి హాజరైన ఆయనపై ఒక వ్యక్తి బుధవారం కాల్పులకు పాల్పడ్డాడు. నిందితుడు తుపాకీని ఫారూక్‌కు గురిపెట్టినట్టు సీసీటీవీ ఫుటేజ్‌ల ద్వారా తెలుస్తున్నది. ఆ సమయంలో ఫారూక్ వెంట ఉప ముఖ్యమంత్రి సురేందర్ చౌదరి కూడా ఉన్నారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని రక్షణ సిబ్బంది వెంటనే పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో చౌదరికి స్వల్ప గాయం కాగా, ఫారూక్ ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా తప్పించుకున్నారు. నిందితుడు జమ్ము నివాసి, గనుల వ్యాపారి కమల్ సింగ్ జమ్వల్‌గా గుర్తించారు. నిందితుడు ఈ కాల్పులకు ఎందుకు పాల్పడిందీ వివరాలు తెలియరాలేదు. తన తండ్రిపై జరిగిన కాల్పులపై జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జడ్ ప్లస్, ఎన్ఎస్‌జీ రక్షణ ఉన్న ఒక మాజీ ముఖ్యమంత్రిపై ఇలా హత్యాయత్నానికి పాల్పడటం పలు సందేహాలను కలిగిస్తున్నదని అన్నారు.

విశ్వ వీక్షణం

దుబాయ్ ఎయిర్‌పోర్టుపై దాడి

- భారతీయుడు సహా మరో ముగ్గురికి గాయాలు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా దుబాయ్‌పై వరుసగా దాడులు చేస్తోంది. తాజాగా దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో ఒక భారతీయుడు సహా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ విషయంపై దుబాయ్ అధికారులు ప్రకటన చేశారు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడిలో ఒక భారతీయుడు, ఒక బంగ్లాదేశీ, ఇద్దరు ఘనా పౌరులు గాయపడ్డట్లు అధికారులు వెల్లడించారు. వారికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఒకపక్క ఇరాన్ దాడులు జరుగుతున్నప్పటికీ దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమాన సర్వీసులు కొనసాగుతున్నాయని తెలిపారు. మరోవైపు ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా క్షేమంగానే ఉన్నాడని ఆ దేశం ప్రకటించినప్పటికీ ఇజ్రాయెల్ దీన్ని నమ్మడం లేదు. అతడు స్వల్పంగా గాయపడి ఉంటాడని భావిస్తోంది. తమ దేశం కాల్పుల విరమణ కోరుకోవడం లేదని, తమపై దాడులు చేసిన వారు పర్యవసానాలు ఎదుర్కోవాల్సిందే అని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఇరాన్ జరుపుతున్న మిస్సైల్ దాడుల్ని తమ డిఫెన్స్ రక్షణ వ్యవస్థ అడ్డుకుంటోందని యూఏఈ అధికారులు అంటున్నారు. బుధవారం పలు ఇరాన్ మిస్సైల్స్‌ను అడ్డుకున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయెల్ జరుపుతున్న మిస్సైల్ దాడుల్ని తాము అడ్డుకుంటున్నట్లు ఇరాన్ తెలిపింది. ఇజ్రాయెల్ ప్రయోగించిన అధునాతన హెర్మెస్ 900 మిస్సైల్స్, హెరాన్ టీపీ మిస్సైల్స్‌ను ఇరాన్ డిఫెన్స్ సిస్టమ్ గగనతలంలోనే అడ్డుకున్నట్లు అక్కడి మీడియా తెలిపింది.

ప్రతిపక్షం
Prathipaksham.in



కిడ్నీ సమస్యలపై అవగాహన అవసరం

నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

డా. కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్
7702417779

ప్రపంచ కిడ్నీ దినోత్సవం అనేది 2006 నుండి ప్రతి సంవత్సరం మార్చి నెలలో 2వ గురువారం నాడు (12.03.2026) జరుపుకునే ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం , మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో వారి పాత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులను ఒకచోట చేర్చి కిడ్నీల గురించి అవగాహన కల్పించడం. మన దేశంలో 13.8 కోట్ల మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నట్లు లాన్సెట్ మెడికల్ జర్నల్ ప్రచురించిన తాజా అధ్యయనంలో తెలిపింది. భారత్ దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి యొక్క ప్రాబల్యం సుమారు 10 లక్షల మందికి 800 మంది ఉండగా, చివరి దశ మూత్రపిండ వ్యాధి (ESRD) సంభవం 10 లక్షల మందికి 150-200 మంది. భారతదేశంలో దయాబెటిక్ నెఫ్రోపతీ అత్యంత సాధారణ కారణం కాగా గత రెండు దశాబ్దాలలో మూత్రపిండాల సంబంధిత రోగులు రెట్టింపు అయ్యారు ఇందు కోసం ముఖ్యంగా మన దేశంలోమూత్రపిండాల ఆరోగ్య అవగాహనను ప్రోత్సహించడం చాలా అవసరం, ఇక్కడ మధుమేహం మరియు రక్తపోటు వంటి పరిస్థితులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి (CKD)తో బాధపడుతున్నారు, మన దేశంలోనే అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఆరోగ్యశ్రీ, వైద్యారోగ్య శాఖల గణాంకాల ప్రకారమే.. ఈ సమస్యలతో బాధపడుతున్నవారు 50 లక్షల మంది వరకు ఉన్నారు. ఈ క్రమంలోనే కిడ్నీ సమస్యల ప్రమాదం పెరిగిపోతోంది. క్రానిక్ కిడ్నీ వ్యాధి (CKD) కేసులు ప్రపంచంలోనే అత్యధికంగా చైనాలో 15.2 కోట్లు ఉన్నాయి. తర్వాత, 13.8 కోట్ల కిడ్నీ వ్యాధి కేసులతో భారత్ రెండో స్థానంలో ఉంది... జన్యుపరంగా, దక్షిణాసియా భౌగోళిక ప్రాంతాల ప్రజలు, అంటే భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్ మరియు శ్రీలంక నుండి వచ్చిన ప్రజలు, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంది.., ఆర్థికంగా సమృద్ధిగా ఉన్న, అభివృద్ధి చెందిన దేశాలలో కిడ్నీ రోగుల సంఖ్య తక్కువగా ఉంది. కిడ్నీ వ్యాధుల బారినపడడంతో పాటు మరణాల రేటులో కూడా చైనా తర్వాత భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది.. సాధారణంగా రక్తం ద్వారా అందిన పోషకాలను కణాలు వినియోగించుకున్న తర్వాత కొన్ని వ్యర్థాలు, విషతుల్యాలు వెలువడుతుంటాయి. ఇవి ఎప్పటిప్పుడు బయటకు పోవటం చాలా కీలకం. కిడ్నీలు చేసే అతి ముఖ్యమైన పని ఇదే. ఒక్కో మూత్రపిండంలో దాదాపు 10 లక్షల వడపోత విభాగాలు (నెఫ్రాన్లు) ఉంటాయి. ఇవి రోజుకి సుమారు 150 లీటర్ల రక్తాన్ని శుద్ధిచేస్తూ, దాదాపు 2 లీటర్ల మూత్రాన్ని తయారు చేస్తాయి. వ్యర్థాలు, విషతుల్యాలన్నీ దీని ద్వారానే బయటకు పోతాయి. అయితే కిడ్నీలు ఒక్క రక్తాన్ని వడ పోయటమే కాదు, విటమిన్ డిని ప్రేరేపితం చేయటం ద్వారా ఎముకలు ఆరోగ్యంగా ఉండటానికీ తోడ్పడతాయి. అలాగే ఎరిత్రోపాయిటిన్ ను ఉత్పత్తి చేస్తూ హిమోగ్లోబిన్, రక్తకణాలు తయారుకావటానికి, రక్తంలో సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు తగు మోతాదులో ఉండటానికీ దోహదం చేస్తాయి. అందువల్ల కిడ్నీలు విఫలమైతే శరీరం మొత్తం చతికిల పడుతుంది. ఇక్కడే డయాలసిస్, కిడ్నీ మార్పిడి ఆదుకుంటున్నాయి. "కిడ్నీ ఫెయిల్యూర్ "రెండు విధాలుగా జరుగుతుంది. ఒకటి ఆకస్మిక కిడ్నీ ఫెయిల్యూర్, రెండవది దీర్ఘకాలిక కిడ్నీ ఫెయిల్యూర్ . దీనినే మనం దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి అని పిలుస్తాం. చాలా మంది ఈ రెండవ రకం వ్యాధితో బాధపడుతున్నారు.. మారుతున్న జీవనశైలి వల్లే కిడ్నీ వ్యాధులు వస్తున్నాయి. కిడ్నీ సమస్యలకు ముఖ్య కారణం అదుపులో లేని మధుమేహం. అది కాక, అధిక రక్తపోటు, కొన్ని సార్లు బీ.పీ తగ్గిపోవడం వల్ల, ఎన్నో ఇతర ఇన్ఫెక్షన్లు (డెంగూ, మలేరియా, హెచ్ఐవీ, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు), మూత్ర పిండాల రాళ్లు, కొన్ని రకాల మందుల (నొప్పి తగ్గడానికి వాడే మాత్రలు, స్టెరాయిడ్ మాత్రలు, కొన్ని యాంటీబయాటిక్స్) వల్ల ఈ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా, మోతాదు తెలియని వాళ్లు ఇచ్చే పసరు మందులు, చెట్ల మందుల వల్ల, కొన్ని సార్లు జన్యు పరమైన సమస్యల కారణంగా, లూపస్ (SLE) వంటి కొన్ని స్వయం ప్రతిరక్షక వ్యాధులు (మహిళల్లో అధికంగా) మూత్ర పిండాలు పాడవడానికి కారణం అవ్వవచ్చు.. ఒకసారి డయాలిసిస్‌కి దాదాపు 3వేల రూపాయలు. వారానికి మూడు సార్లు, ప్రతిసారి నాలుగు గంటలు, అదీ జీవితాంతం చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు డబ్బుతో పాటు, రోగితో మరొకరు కూడా తమ సమయాన్ని కేటాయించవలసి ఉంటుంది. ఇలాంటి ఒక సమస్య తీవ్రతను తగ్గించడం, ముందస్తుగా గుర్తించే అవగాహన పెంచడం, తగిన చికిత్స అందించడం చాలా అవసరం. ముఖ్యంగా దీర్ఘకాలిక జబ్బులతో బాధ పడుతున్న వారు, వైద్యుల సలహా మేరకు మందులు వాడుతూ వాటిని అదుపులో పెట్టుకోవడం చాలా ముఖ్యం . కిడ్నీ వ్యాధి ఉన్న 30% మందికి తమకు ఆ వ్యాధి ఉన్నట్టు తెలియదు..అందుకోసం ప్రతి ఏటా రక్త పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. బీపీ, షుగర్, మూత్రం, రక్త పరీక్షల ద్వారా కిడ్నీ వ్యాధిని గుర్తించవచ్చు. నిర్దిష్ట వ్యవధిలో క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేయించుకోవాలి..



గుర్తించడం ఎలా ?

మూత్ర పిండాల సమస్యను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులువవుతుంది. కేవలం రెండు చిన్న, అతి తక్కువ ఖర్చుతో చేసే పరీక్షలతో గుర్తించవచ్చు (సీరం క్రియాటినిన్, యూరిన్ ప్రొటీన్/అల్బుమిన్ ఎక్రిషన్). మూత్రంలో ఏదైనా ఇన్ఫెక్షన్ ఉంటే, మూత్ర పరీక్షలో తెలిసే అవకాశం ఉంది. దీర్ఘ కాలిక జబ్బులు అదుపులో ఉన్నాయా లేదా అని తెలియడానికి, సంబంధిత షుగర్ పరీక్షలు, కొవ్వు పరీక్షలు చేయవలసి ఉంటుంది. కడుపు స్కాన్ (అల్ట్రాసౌండ్) చేయడం వల్ల, మూత్ర పిండాలు కుంచించుకు పోయి ఉన్నాయా అని, లేదా వాటిలోని రాళ్లను, వాపును, ఏదైనా ఇన్ఫెక్షన్ ఉంటే దాన్ని గుర్తించే అవకాశం ఉంది. రక్తం ఉత్పత్తి సరిపడా అవుతుందా లేదా అని తెలిపే రక్త పరీక్ష, గుండె పని తీరును గుర్తించే గుండె స్కానింగ్ (2d echo), మొదలగు పరీక్షలు అవసరాన్ని బట్టి చేయించవలసి ఉంటుంది.

కిడ్నీ సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు..

- ఆహారంలో ఉప్పు తక్కువ తీసుకోవాలి
- అధికంగా మాంసం తీసుకోకూడదు
- ప్రతి రోజు కనీసం అరగంట వ్యాయామం చేయాలి
- ఆహారంలో సగభాగం పీచు పదార్థాలు ఉండేలా చూసుకోవాలి
- ధూమపానం,మద్యపానం మానేయాలి
- నొప్పి గోళీలు, అనవసరంగా స్టెరాయిడ్స్ వాడకూడదు
- రక్త పోటు, మధుమేహం ఉన్న వారు తరుచూ పరీక్ష చేసుకుంటూ, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి
- రక్త హీనత, నీరసం, ఒళ్లు నొప్పులు, వంటి సమస్యలు ఉంటే వెంటనే మివ్యక్తిగత వైద్యుల సలహా మీద పరీక్షలు చేయించుకోవాలి
- అయితే, మూత్ర పిండాల సమస్య వల్ల, ఆరోగ్య పరమైన ఇబ్బందులే కాక, ఆర్థిక పరంగానూ మనల్ని ఇబ్బంది పెట్టేదే. కిడ్నీ సమస్యలను సరైన సమయంలో గుర్తించడం ఆలస్యమైతే చికిత్స చాలా ఖర్చుతో కూడుకుంటుంది.



దేశంలో ఎల్పీజీ కొరత లేదు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 11: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాబోయే రోజుల్లో పెట్రోల్, ఎల్పీజీ కొరత ఏర్పడవచ్చునన్న వార్తలను ప్రధాని మోదీ ఖండించారు. ప్రజలు ఎవరూ భయాందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. తమిళనాడు పర్యటనలో ఉన్న మోదీ అధికార డీఎంకేపై విమర్శలు గుప్పించారు. తమిళ ప్రజలు, ప్రతి కుటుంబం కోసం పనిచేసే ప్రభుత్వమే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కేవలం ఒకే కుటుంబం కోసం పనిచేసే ప్రభుత్వం కాదని మోదీ అన్నారు. రాష్ట్రంలో మార్పు తీసుకురావడం కేవలం ఎన్‌డీఏ వల్లనే సాధ్యమని ప్రజలు తెలుసుకున్నారని వ్యాఖ్యానించారు. 2021లో తమిళనాడు ప్రజలు డీఎంకేను అధికారంలోకి తీసుకొచ్చారని, కానీ వారు దానిని బాధ్యతగా తీసుకోవడానికి బదులుగా, ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అన్ని నదులు సముద్రంలోకి వెళ్లినట్లే, తమిళనాడులోని అవినీతి డబ్బు అంతా ఒకే కుటుంబానికి వెళుతోందని డీఎంకేను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా తిరుచిరాపల్లిలో బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. నూతన ప్రాజెక్టులు తమిళనాడు యువతకు ఇంధన లభ్యత, కనెక్టివిటీని పెంచుతాయని, అలాగే, వేలాది మందికి ఉపాధిని కల్పిస్తాయని మోదీ పేర్కొన్నారు.

మేం మాట్లాడకుండా స్పీకర్ అడ్డుకున్నారు

- లోక్ సభలో రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 11: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై వాడివేడి చర్చ జరుగుతోంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ స్పీకర్ పాత్రపై, ప్రధాని మోదీపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోదీ రాజీ పడ్డారని పేర్కొన్నారు. భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'' పుస్తకంపై కూడా చర్చ జరగకుండా చేశారని పేర్కొన్నారు. లద్దాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నరవణె రాసిన విషయాలు చెప్పనివ్వకుండా చేశారని, అందుకే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చిందని అన్నారు. కాగా, జాతీయ భద్రత లాంటి అంశాలపై మాట్లాడేటప్పుడు ప్రతిపక్షనేత ఆచితూచి మాట్లాడాలని, పార్లమెంటరీ నిబంధనలను ఊటంకిస్తూ బీజేపీ నేత రవిశంకర్ చేసిన వ్యాఖ్యలపై కూడా రాహుల్ ఘాటుగా స్పందించారు. చర్చా సమయంలో తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ, తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. 'నేను ఎం.ఎం.నరవాణె రాసిన పుస్తకం గురించిన అంశాన్ని లేవనెత్తాను. ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి మాట్లాడాను. అదానీ అంశాన్నీ తెరపైకి తెచ్చాను. కానీ నా గొంతు నొక్కేశారు. ఈ అంశాలు భారత ప్రజలు కచ్చితంగా తెలుసుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు. మన ప్రధాని మోదీ రాజీపడ్డారు. దాని ఫలితం అందరికీ తెలుసు' అని రాహుల్ గాంధీ అన్నారు.

బ్యాటింగ్‌లో టాప్.. అభిషేక్

ఇటీవలే ముగిసిన పొట్టి ప్రపంచకప్‌లో విఫలమైనా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఐసీసీ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఐసీసీ బుధవారం ప్రకటించిన పురుషుల టీ20 ర్యాంకింగ్స్‌లో అతడు.. 875 రేటింగ్ పాయింట్లతో తొలి స్థానంలోనే కొనసాగుతున్నాడు. ఇక ఈ టోర్నీకి ముందు భారత జట్టుతో చేరిన ఇషాన్ కిషన్.. ప్రపంచకప్‌లో 317 రన్స్‌తో రెండు స్థానాలు మెరుగుపరుచుకుని రెండో స్థానానికి (871 పాయింట్లు) ఎగబాకాడు. ఫర్హాన్ (పాకిస్థాన్), సాల్ట్ (ఇంగ్లండ్), నిస్సాంక (శ్రీలంక) టాప్ 5లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో వరుణ్ చక్రవర్తి నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయాడు. రషీద్ ఖాన్ టాప్ ప్లేస్‌లో నిలిచాడు. టాప్ 10లో బుమ్రా ఆరోస్థానంలో ఉన్నాడు.

బంగ్లాదేశ్ చేతిలో పాకిస్తాన్ ఓటమి

టీ20 ప్రపంచకప్‌లో దారుణ వైఫల్యం తర్వాత తొలి వన్డే సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్‌కు వచ్చిన పాకిస్థాన్‌కు మరోసారి చుక్కెదురైంది. ఇరుజట్ల మధ్య ఢాకాలో బుధవారం జరిగిన మొదటి వన్డేలో షహీన్ షా అఫ్రిది సారథ్యంలోని పాకిస్థాన్‌ను.. ఆతిథ్య జట్టు 8 వికెట్ల తేడాతో చిత్తుచిత్తుగా ఓడించి సిరీస్‌లో10 ఆధిక్యం సాధించింది. యువ పేసర్ నహీద్ రాణా (24/5) పేస్ ధాటికి మెన్ ఇన్ గ్రీన్.. 30.4 ఓవర్లకు 114 పరుగులకే చాపచుట్టేసింది. లోయరార్డర్ బ్యాటర్ ఫహీమ్ అష్రఫ్ (37) టాప్ స్కోరర్. పాక్ జట్టులో ఏకంగా ఆరుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. రాణాకు తోడు కెప్టెన్ మెహిది హసన్ మిరాజ్ (3/29) కూడా రాణించడంతో ప్రత్యర్థి కుదేలైంది. ఓపెనర్లు ఫర్హాన్ (27), సదాకత్ (18) తొలి వికెట్‌కు 41 రన్స్ జోడించినా రాణా ఎంట్రీతో పాక్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. అనంతరం ఛేదనను బంగ్లా.. 15.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే నష్టపోయి పూర్తిచేసింది. తంజిద్ హసన్ (62 నాటౌట్), నజ్ముల్ హొసేన్ (27) రాణించారు. రాణాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో సెమీస్‌కు భారత్

ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళల జట్టు సెమీఫైనల్స్‌కు దూసు కెళ్లింది. గచ్చిబౌలిలో బుధవారం రాత్రి భారత జట్టు.. 41తో వేల్స్‌పై ఘనవిజయం సాధించి పూల్ బీ నుంచి సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. నవ్‌నీత్ కౌర్ హ్యాట్రిక్ (29, 34, 55 నిమిషాల్లో) గోల్స్ చేసి భారత్‌ను తిరుగులేని స్థితిలో నిలుపగా సాక్షి రాణా (7వ నిమిషంలో) ఒక గోల్ కొట్టింది. వేల్స్ నుంచి థామస్ బెట్సన్ ఒక గోల్ చేసింది. ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా సెమీస్ బెర్తును దక్కించుకునే అవకాశమున్న భారత్.. నాలుగు క్వార్టర్స్‌లోనూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి ఏకపక్ష విజయం సాధించింది. తొలి క్వార్టర్స్ ఏడో నిమిషంలోనే సాక్షి.. కెప్టెన్ సలీమ అందించిన బంతిని బలమైన రివర్స్ హిట్‌తో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపి తొలి గోల్‌ను అందించింది. రెండో క్వార్టర్ నుంచి నవ్‌నీత్ మాయ మొదలైంది. పెనాల్టీ కార్నర్‌ను తొలి గోల్‌గా మలిచిన ఆమె.. మూడో క్వార్టర్‌లోనూ మరో గోల్‌తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేసింది. ఆఖరి క్వార్టర్‌లో వేల్స్ గోల్ కొట్టి ఆతిథ్య జట్టు ఆధిపత్యాన్ని తగ్గించినా 55వ నిమిషంలో నవ్‌నీత్ హ్యాట్రిక్‌తో భారత్ భారీ విజయం సాధించింది. సెమీస్‌లో భారత జట్టు శుక్రవారం.. ఇటలీతో తలపడనుంది.

ఐపీఎల్ షెడ్యూల్ వచ్చేసింది

డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య బెంగళూరు వేదికగా జరుగబోయే మ్యాచ్‌తో 2026 సీజన్ ఆరంభమవనుంది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 దాకా జరుగనున్న తొలి దశ షెడ్యూల్‌లో పది జట్లు.. నాలుగేసి మ్యాచ్‌లు ఆడనున్నాయి. కాగా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా మొదటి దఫా షెడ్యూల్‌ను విడుదల చేసిన బీసీసీఐ.. ఎన్నికల తేదీ వచ్చాక పూర్తి షెడ్యూల్‌ను వెల్లడించే అవకాశముంది. ఐపీఎల్‌లో తొమ్మిదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆర్‌సీబీ, ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌తో టోర్నీ ఆరంభమవనుంది.

2016లో బెంగళూరును ఓడించి డిఫెండింగ్ చాంపియన్ హోదాలో హైదరాబాద్.. 2017లో ఆర్‌సీబీతో ఫస్ట్ మ్యాచ్‌ను ఆడింది. ఆ తర్వాత ఈ రెండు జట్లు టోర్నీ ప్రారంభ మ్యాచ్ ఆడటం ఇదే తొలిసారి. సీజన్ తొలి మ్యాచ్ ఆడనుండటం ఎస్ఆర్‌హెచ్‌కు ఇది రెండోసారి కాగా ఆర్‌సీబీకి ఏడోసారి కావడం విశేషం. ఇదిలా ఉండగా బెంగళూరులోనే మ్యాచ్‌లు జరుగుతాయని బీసీసీఐ తెలిపినా చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లపై ఇంకా అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ఈ మైదానంలో మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఎక్స్‌పర్ట్ కమిటీ ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఈనెల 13న కమిటీ.. చిన్నస్వామిని సందర్శించి ఆ తర్వాత తమ నిర్ణయాన్ని వెల్లడించనుంది. 16 రోజుల పాటు జరిగే ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్‌లో ఆయా జట్లు.. తమ ప్రత్యర్థులతో నాలుగు మ్యాచ్‌లు ఆడతాయి. అయితే ఈసారి పది జట్లను రెండు గ్రూపులుగా విభజించడంపైనా స్పష్టత లేదు. ప్రతి సీజన్‌లో పది జట్లు రెండేసి గ్రూపులుగా విడిపోయి మ్యాచ్‌లు ఆడుతాయన్న విషయం విదితమే. మొదటి 20 మ్యాచ్‌ల్లో భాగంగా నాలుగు డబుల్ హెడర్‌లు జరుగనున్నాయి. ఐపీఎల్ ప్రారంభమైన రెండో వారం మొదటి శనివారం (ఏప్రిల్ 4న) ఢిల్లీ, ముంబై మధ్యాహ్నం మ్యాచ్ ఆడనుండగా గుజరాత్, రాజస్థాన్ అహ్మదాబాద్‌లో రాత్రి తలపడతాయి. ఏప్రిల్ 5, 11, 12వ తేదీల్లో డబుల్ హెడర్‌లు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మ్యాచ్‌లు 3:30 గంటలకు, రాత్రి మ్యాచ్‌లు 7:30 గంటలకు మొదలవుతాయి.

హైదరాబాద్‌లో ఒకే మ్యాచ్

సీజన్ ప్రారంభ మ్యాచ్ ఆడబోయే సన్‌రైజర్స్.. ఈ దశలో సొంతమైదానంలో ఒక్కటంటే ఒకటే మ్యాచ్ ఆడుతుంది. ఏప్రిల్ 5 మధ్యాహ్నం.. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఉప్పల్ స్టేడియం మోతెక్కనుంది.

'డేవిడ్ రెడ్డి' కోసం మంచు మనోజ్ స్టంట్ మోడ్‌లో ట్రాన్స్‌ఫర్మేషన్

మంచు మనోజ్.. వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న సంగతి తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్తదనంతో ప్రేక్షకులను ఆయన ఆకట్టుకుంటుంటారు. తాజాగా మరోసారి సోషల్ మీడియాలో ఆయన చేసిన పోస్ట్ ఫ్యాన్స్ సహా ప్రేక్షకులను, సినీ వర్గాలను ఆకర్షిస్తున్నాయి. మనోజ్ తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ గురించిన అప్‌డేట్‌ను ఆయన షేర్ చేసుకున్నారు. రాబోయే సినిమాల కోసం గత మూడు వారాలుగా కఠినంగా శ్రమిస్తున్నానని ఆయన ఈ పోస్ట్‌లో వెల్లడించారు. అలాగే ఆయన పోస్ట్ చేసిన వర్కౌట్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. నటుడిగా మనోజ్ చూపిస్తోన్న పట్టుదల, కృషిని అందరూ అభినందిస్తున్నారు. ఆ పోస్ట్‌లో మనోజ్ తన తీసుకున్న నిర్ణయం గురించి చాలా నిజాయితీగా మాట్లాడారు. సౌకర్యంగా ఉండటానికి సాకులు వెతకకుండా వాటిని పక్కకు పెట్టేసి కష్టపడాలని నిర్ణయించుకున్నానని ఆయన పేర్కొన్నారు. "మూడు వారాల క్రితం నేను ఒక నిర్ణయం తీసుకున్నాను. ఇక సౌకర్యంతో రాజీ పడటం లేదు. ఇక సాకులు చెప్పాలని అనుకోవటం లేదు. కేవలం కష్టం మాత్రమే," అని ఆయన రాశారు. ఇదే క్రమంలో యాక్షన్ సినిమాలు చేయడం ఎంత కష్టమో కూడా ఆయన వివరించారు. "యాక్షన్ సినిమాలో మీ కోసం ఎవరూ నటించలేరు. ప్రతి పంచ్, దెబ్బ తగిలినప్పుడు పడిపోవటం, ప్రతి దెబ్బకు మీ శరీరం సిద్ధంగా ఉండాలి. లేకుంటే వెంటనే యటపడుతుంది. కెమెరా ఎప్పుడూ అబద్ధం చెప్పదు," అని ఆయన అన్నారు. ఇకపై కేవలం లుక్ కోసం కాకాకుండా..శక్తి, సహనాన్ని పెంచుకోవడంపైనే తాను దృష్టి పెట్టానని ఆయన చెప్పారు. తన లక్ష్యం " ధృడమైన వ్యక్తి"లా తయారవడం అని పేర్కొన్నాడు. ఈ అప్‌డేట్‌ను "వీక్ 3" అని పేర్కొంటూ, ఈ ప్రయాణం ఇప్పుడే మొదలైందని, కానీ కేవలం 21 రోజుల్లోనే తాను పూర్తిగా వేరే వ్యక్తిలా అనిపిస్తున్నానని మనోజ్ తెలియజేశారు.

'ఆయా షేర్' హిట్ కావడం ఆనందంగా ఉంది

లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్

నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ 'ది ప్యారడైజ్' ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. ప్రస్తుతం ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా టాప్ లో ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంటుంది. 'ది ప్యారడైజ్ చిత్రం ఆగస్టు 21న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆయా షేర్ సాంగ్ లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్ విలేకరలు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

'ఆయా షేర్' సాంగ్ కి వస్తున్న రెస్పాన్స్ ఎలా అనిపిస్తోంది ?

ఆయా షేర్ పాట ప్రోమో విడుదలైనప్పటి నుంచి మంచి బజ్ క్రియేట్ చేసింది. పాట రిలీజ్ అయిన తర్వాత అన్ని రికార్డ్స్ బద్దలు కొట్టుకుంటూ అందరికీ నచ్చింది. అనిరుధ్ గారు నేను ఇచ్చిన పదాలు తీసుకొని జనాలకి రీచ్ అయ్యేవిధంగా ట్యూన్ చేశారు. మట్టి వాసన తెలిసిన జానపద గాయకులు జంగిరెడ్డి, దేవయ్య అద్భుతంగా పాడారు. ఇంత ఫిరోషియస్ సాంగ్ లో లిరిక్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. నా కెరీర్లో ఈ పాట ఇచ్చినంత కిక్కు మరి ఏ పాట ఇవ్వలేదు. నేను ఉపయోగించిన భాష, యాసకి సోషల్ మీడియాలో చాలా అద్భుతమైన ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ పాట విన్న తర్వాత నాకు చాలా మెసేజుల వచ్చాయి. జీవితంలో సర్వస్వం కోల్పోయానని బాధపడే ఓ వ్యక్తి.. ఈ పాట విని ఒక కొత్త స్ఫూర్తి పొందానని చెప్పాడు. అలాంటి మెసేజ్లు చాలా వచ్చాయి. ఈ స్పందన నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ సినిమాలో నాని గారి క్యారెక్టర్ లో ఒక అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది. ఆ జడల్ వెనుక మంచి కథ ఉంటుంది. ఇప్పుడు అందరూ ఆ జడలు గురించి మాట్లాడుకుంటున్నారు. సినిమా చూసిన తర్వాత వాటికి అద్భుతమైన జస్టిఫికేషన్ ఉంది అనుకుంటారు.

ఇప్పుడు అందరు కూడా జడలు వేసుకుని రీల్స్ చేస్తున్నారు. ఆ కల్చర్ ని గుర్తు చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. అనిరుద్ గారు పాట చేస్తున్నప్పుడే పెద్ద హిట్ కొడుతున్నాం అని చెప్పారు. ఆయనతో వర్కింగ్ ప్రాసెస్ ని చాలా ఎంజాయ్ చేశాను. ఈ పాట సక్సెస్ కి ముఖ్య కారణం డైరెక్టర్ శ్రీకాంత్. జనం నుంచి పుట్టిన ఒక వీరుడు ఆ జనాలకు స్ఫూర్తిని ఇచ్చే క్రమంలో వచ్చిన పాట ఇది. ఈరోజు అందరి నుంచి అద్భుతమైన రెస్పాన్స్ అందుకుంటుంది. ఈ పాట రాయడానికి వారం రోజులు పట్టింది. కొన్ని వెర్షన్స్ డెవలప్ చేసుకుంటూ చివరికి దీనిని ఫిక్స్ చేశాం. కాకపోతే సాంగ్ సెంట్రల్ ఐడియా మాత్రం ఇమ్మిడియట్ గా లాక్ చేశాం.

ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ చెప్పడానికి ఒక ప్రత్యేకమైన పల్లవి ఉంటే బాగుంటుంది అనుకున్నాను. ఆ ఆలోచన శ్రీకాంత్ గారికి నచ్చింది. ఈరోజు సోషల్ మీడియాలో అదే పల్లవి గురించి మాట్లాడుతున్నారు.

తెలంగాణ మండలికంలో పాటంటేనే మీ పేరు గుర్తొస్తుంది కదా ఎలా అనిపిస్తుంది?

చాలా ఆనందంగా ఉంది. సీనియర్ కవులని స్ఫూర్తిగా తీసుకునే ముందుకు సాగుతున్నాను. కొసరాజు గారు, జాలాది గారు ఈ యాసతో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. నేను రాసిన ఎక్కువ పాటలు తెలంగాణ యాసలో వచ్చాయి. దాదాపు అన్ని రకాల పాటలు రాశాను. డైరెక్టర్ గారు ఈ పాట గురించి పూర్తిగా వివరించారు. ఒక ఒక జాతి కష్టం నుంచి పుట్టే ఒక యోధుడు ఆ జాతికి స్ఫూర్తి నింపే నేపథ్యంలో వచ్చే పాటిది. 80 దశకాల్లో జరిగే నేపథ్యం కాబట్టి అప్పుడు ఉర్దూ ప్రభావం ఉంటుంది. అందుకే ఇందులో చాలా వరకు ఉర్దూ పదాలు ఉపయోగించడం జరిగింది.

డైరెక్టర్ శ్రీకాంత్ గారితో ఇది రెండో సినిమా కదా.. ఆయనతో పనిచేయడం ఎలా అనిపించింది?

శ్రీకాంత్ గారితో వర్క్ చేయడం అద్భుతమైన అనుభూతి. ఆయన చాలా ప్రశాంతంగా ఉంటారు. కానీ ఏదైనా ఒక సందర్భం చెప్పాల్సి వచ్చినప్పుడు తన ఒక ఎమోషన్ తో చెప్తారు. ఈ పాట జరుగుతున్నప్పుడు సెట్లోకి వెళ్లాను. అక్కడ నాకు ఒక సమ్మక్క సారక్క జాతర జరుగుతున్న ఫీలింగ్ కలిగింది. తన విజన్ చాలా క్లియర్ గా ఉంటుంది. ప్రతి డిపార్ట్మెంట్లో తనకున్న పట్టు, పడే కష్టం చాలా అద్భుతం.

చిరంజీవి గారితో చేయబోయే సినిమాలో కూడా మీ పాట ఉంటుందా?

అది ఇప్పుడే చెప్పలేను. ఇటీవల శంకర వరప్రసాద గారిలో చిరంజీవి గారు వెంకటేష్ గారు కలిసి చేసిన పాటకి నేను పాట రాయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. విశ్వంభరలో కూడా నా పాట ఉంది. పవన్ కళ్యాణ్ గారికి ఉస్తాద్ లో రాశాను.

నాని గారు ఈ పాట విన్నతర్వాత ఎలా రెస్పాండ్ అయ్యారు?

'నాకు లైఫ్ లాంగ్ సరిపోయే కిక్ ఇచ్చారు. ధూమ్ ధామ్ దోస్తానా, చమ్కీలా అంగి, ఇప్పుడు ఆయా షేర్.. ఇలా నాకు మర్చిపోలేని హిట్లు ఇచ్చారు' అని చాలా అభినందించారు. ఇలాంటి అద్భుతమైన సెలబ్రేషన్ కి నేను రాయడం చాలా ఆనందంగా ఉందని ఆయన ప్రత్యేకంగా ట్వీట్ కూడా చేశారు

ప్రస్తుతం రాస్తున్న సినిమాలు?

లెనిన్, మా ఇంటి బంగారం, ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ రెడీగా ఉన్నాయి. ఇంకొన్ని సినిమాలు నడుస్తున్నాయి.

'వదలా' సినిమా అద్భుతంగా వచ్చింది

హీరో జగపతి బాబు

జగపతి బాబు, బలమైన కుటుంబ భావోద్వేగాలతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ 'వదలా'తో రాబోతున్నారు. ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించగా, హృతిక శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు. అకెళ్ళ వి కృష్ణ దర్శకలో కిషోర్ నాయుడు చిరుమామిళ్ళ, తమ్మారెడ్డి భరద్వాజ్ చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. ఈరోజు మేకర్స్ గ్రిప్పింగ్ గ్లింప్స్ లాంచ్ చేశారు. గ్లింప్స్ ప్రారంభంలో జగపతిబాబు కలవరపరిచే ఆలోచనల్లో మునిగిపోయినట్లు కనిపించారు. ఆ తర్వాత లయ ఎంట్రీ ఇస్తుంది. ఆమె ముఖంలో కనిపించే ఆందోళన, టెన్షన్ కథలోని పరిస్థితులను సూచిస్తుంది. కథ ఒక్కసారిగా మరింత డార్క్ టోన్‌లోకి మారుతుంది. ఒక మహిళా వాయిస్ ఓవర్ వినిపిస్తూ ''నీ ఫ్యామిలీలో ఒకరిని తీసేసుకుంటా' అని చెప్పడం షాకింగ్ అల్టిమేటమ్‌ను రివిల్ చేస్తుంది. ఇది వెంటనే ప్రేక్షకులను కథలోకి తీసుకెళ్తుంది. షార్ప్ కట్స్‌తో యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ మూమెంట్స్ "రేస్ అగైనెస్ట్ టైమ్" అనిపించే టెన్షన్ ని సృష్టిస్తాయి. దర్శకుడు ఆకెళ్ళ వి కృష్ణ సస్పెన్స్‌ను హ్యాండిల్ చేసిన తీరు ప్రత్యేకంగా నిలుస్తుంది. జగపతి బాబు కొన్ని కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న పాత్రలో కనిపించారు. మరోవైపు లయ కూడా ఇంటెన్స్ వున్న పాత్రలో కనిపిస్తూ కథకు బలాన్ని ఇస్తుంది. సినిమాటోగ్రాఫర్ చోటా కే నాయుడు అందించిన డైనమిక్ విజువల్స్ సినిమాకు ప్రత్యేక టోన్ సెట్ చేతోంది. సంగీత దర్శకుడు కార్తిక్ అందించిన పల్సేటింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వదలా థీమ్ థ్రిల్‌ను మరింత పెంచుతుంది. ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు చేసిన క్రిస్ప్ ఎడిటింగ్ గ్రిప్పింగ్ గా వుంది. చరిత చిత్ర ప్రొడక్షన్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి లక్ష్మీ భూపాల రచన అందించగా, ఆర్ట్ డైరెక్షన్‌ను బజ్జా బ్రహ్మయ్య నిర్వహించారు. మొత్తంగా ఈ ఇంట్రిగింగ్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతూ, టెన్షన్, భావోద్వేగం, థ్రిల్ కలిసిన హైఇంపాక్ట్ థ్రిల్లర్‌ను ప్రామిస్ చేస్తోంది. హీరో జగపతిబాబు మాట్లాడుతూ...అందరూ ఇష్టపడి చేసిన సినిమా ఇది. ఈ సినిమా భోపాల్ లో చేశాం. అక్కడి ప్రభుత్వానికి ధన్యవాదాలు. భరద్వాజ గారు నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇప్పటికీ 24 గంటలు పనిచేస్తున్నారు.ఆయన్ని అభినందించాలి. ఆయన ఆలోచనలు చాలా మోడరన్ గా ఉన్నాయి. అలాంటి ప్రొడ్యూసర్స్ ఉండడం చాలా హ్యాపీగా ఉంది. సినిమా పనిచేస్తున్న అందరూ నటీనటులు టెక్నీషియన్స్ చాలా సపోర్ట్ చేశారు. కార్తిక్ సూపర్ మ్యూజిక్ ఇచ్చాడు. తన నుంచే వదలా అనే టైటిల్ కూడా వచ్చింది. లయ నా డియర్ ఫ్రెండ్. మనోహరం సినిమా చేసినప్పుడు తను చాలా చిన్న పిల్ల. తర్వాత హనుమాన్ జంక్షన్ చేశాం. వదలాలో కూడా అద్భుతమైన పర్ఫామెన్స్ ఉంది.ఆముద పాత్రలో హ్రితిక కూడా చాలా టెర్రిఫిక్ పెర్ఫార్మన్స్ ఇచ్చింది. సినిమా మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాము. ఆడియన్స్ అందరు కూడా ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. సునీల్ నారంగ్ గారు వున్నారు కాబట్టి చాలా మంచి రిలీజ్ ఉంటుంది. కచ్చితంగా మంచి హిట్ కొట్టగలమనే నమ్మకం ఉందని అన్నారు.

సత్యవతిగా రీతు వర్మ

#గోపీచంద్33 నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

మ్యాచో స్టార్ టి గోపీచంద్, విజనరీ దర్శకుడు సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్న హిస్టారికల్ మూవీ #గోపీచంద్33 తో రాబోతున్నారు. పవన్ కుమార్ ప్రజెంట్స్ చేస్తున్న ఈ చిత్రం గోపీచంద్ కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రాలలో ఒకటిగా రూపొందుతోంది. ఈ చిత్రంలో రీతు వర్మ, టి గోపిచంద్ సరసన కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె పాత్ర సత్యవతిని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా పరిచయం చేశారు. పోస్టర్‌లో రీతూ వర్మ అద్భుతమైన గ్రేస్‌తో పాటు ఫియర్స్, కమాండింగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. విల్లు ఎక్కుపెట్టి ఏకాగ్రతతో కనిపిస్తూ, ఒక యోధురాలిలా ధైర్యం, సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నారు. పీరియడ్ స్టైల్ దుస్తులు, సంప్రదాయ ఆభరణాలు, యుద్ధానికి సిద్ధంగా ఉన్న లుక్ ఆమె పాత్రలోని పవర్ ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ సినిమాలో రీతూ వర్మ పూర్తిగా కొత్త తరహా పాత్రలో కనిపించనున్నారు. 7వ శతాబ్దంలో పర్వత ప్రాంతాల్లో నివసించే ఒక గిరిజన తెగకు చెందిన మహిళగా ఆమె పాత్ర ఉంటుంది. ఆ తెగ సంస్కృతి, ధైర్యం, సహనాన్ని ప్రతిబింబించేలా సత్యవతి పాత్ర రూపుదిద్దుకుంది. తన నటన ద్వారా రీతూ వర్మ ఆ పాత్రకు సహజత్వం, భావోద్వేగాలను తీసుకురానున్నారు. ఈ చిత్రంలో హీరో గోపీచంద్ ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యి ప్రత్యేకంగా సిద్ధమయ్యారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200